www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -287 శుక్రవారం 23 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545



## ధాన్యం దిగుబడితో పాటు.. కొనుగోలులోనూ రికార్డు

### 25 సంవత్సరాలలో ఇదే అత్యధిక రికార్డ్

**తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం**

**ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ది**

**బోనస్ తో కలిపి చెల్లించిన మద్దతు ధర మొత్తం 18,532.98 కోట్ల చెల్లింపు**

**వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజమాబాద్,నల్లగొండ జిల్లాలు**

**పౌర సరఫరాల ,నీటిపారుదల, వ్యవసాయ శాఖల విజయమన్న -మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్,/**జనవరి22 ప్రజావినికిడి,**

తెలంగాణా రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్ లో కొనుగోలు చెందిన ధాన్యం దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖా రూపొందించిన ప్రణాలికలపై గురువారం రోజున బేగంపేట ఐ.ఏ.ఎస్.ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ రోడ్‌మ్యాప్

## ఎకనమిక్ ఫోరమ్ ఎండి జెరెమితో సిఎం రేవంత్ భేటీ

**తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను వివరించిన సిఎం**

**హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహణకు విజ్ఞప్తి**

హైదరాబాద్/**జనవరి22 ప్రజావినికిడి,** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంఎండీ జెరెమి జగ్గన్స్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని కోరారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఎకనామిక్ ఫోరం బృందం ఆయనకు తెలిపింది. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్



జెరెమిజగ్గంన్స్, అ4ఎఖీ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలో-అప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో జరిగే దావోస్ లో జరిగే సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని**మిగతాది 2లో...**

## కర్ణాటక అసెంబ్లీలో రగడ..

### గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం




**ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం పూర్తిగా చదవకుండానే వెళ్లిపోయిన గవర్నర్**

**గవర్నర్ ను అడ్డుకుంటూ నిలదీసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

**సరైన నిర్ణయం తీసుకున్నారంటూ గవర్నర్ కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు**

కర్ణాటక అసెంబ్లీలో వివాదం చెలరేగింది. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తన ప్రసంగాన్ని రెండు మాటలతోనే ముగించి సభలో నుంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకంపై కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని గెహ్లాట్ చదవలేదు. దీంతో గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు. మిగతా 2లో...



## సోషల్ మీడియాకు పిల్లలను దూరం చేసే యోచన

**ఆస్ట్రేలియా తరహాలో కట్టడికి యత్నం**

**సీఎం రేవంత్‌తో ప్రత్యేకంగా నారా లోకేశ్ భేటీ**

# ప్రైవేట్ బస్సు దగ్ధం..

## ముగ్గురి సజీవ దహనం

**నంద్యాల జిల్లాలో టైరు పేలి లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు**


**ప్రమాదంలో బస్సు, లారీ డ్రైవర్లతో సహా ముగ్గురు సజీవ దహనం**

**బస్సు అద్దాలు పగలగొట్టి ప్రయాణికులను కాపాడిన డీసీఎం డ్రైవర్**

**సురక్షితంగా బయటపడ్డ 36 మంది ప్రయాణికులు.. పది మందికి గాయాలు**

నంద్యాల,/**జనవరి22 ప్రజావినికిడి,**

నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేటు బస్సు టైరు పేలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బస్సు, లారీ డ్రైవర్లతో సహా ముగ్గురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. అయితే, ఓ డీసీఎం డ్రైవర్



సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో బస్సులోని 36 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు నుంచి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళుతున్న ఏఆర్‌బీసీవీఆర్ ట్రావెల్స్ బస్సు, శిరివెళ్లమెట్ట వద్దకు రాగానే దాని టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో అదుపుతప్పిన బస్సు డివైడర్‌ను **మిగతా 2లో...**



**ఆ కోటరీని నమ్మితే జగన్ ఎప్పటికీ**

## అధికారంలోకి రాలేరు

**లిక్కర్ స్కాంలో ముగిసిన విజయసాయి రెడ్డి ఈడీ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన విజయసాయి**

**రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని స్పష్టం**

**జగన్ చుట్టూ ఉన్న కోటరీ వల్లే పార్టీకి నష్టమంటూ వ్యాఖ్య**

**తనపై చేసిన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

అమరావతి,/**జనవరి22 ప్రజావినికిడి,**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయడంతో పాటు**మిగతా 2లో...**

## నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

### సింగరేణిపై కేంద్రం సంచలన నిర్ణయం

**ఇద్దరు సభ్యులతో కూడిన బృందం ఏర్పాటు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశం**

న్యూఢిల్లీ,,/**జనవరి22 ప్రజావినికిడి,**

తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. నైని కోల్ బ్లాక్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించనుంది. వివాదానికి, టెండర్ రద్దు చేయడానికి గల కారణాలు సహా ఇతర అంశాలపైనా సింగరేణి అధికారులతో కలిసి ఈ బృందం దర్యాప్తు చేయనుంది. ఈ బృందంలో బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా**మిగతా 2లో...**





## కేటీఆర్‌కు సిట్ నోటీసులు

**నేడు 11 గంటలకు హాజరు కావాలని ఆదేశం**

**ఫోన్‌ట్యాపింగ్ కేసులో మరో కీలక మలుపు**

హైదరాబాద్,/**జనవరి22 ప్రజావినికిడి,**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి వచ్చి తమ ఎదుట హాజరు కావాలని బీఎన్‌ఎస్ సెక్షన్ 160 కింద కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసం లో సాయంత్రం 4 గంటలకు సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ నోటీసును బీఆర్‌ఎస్ లీగల్ సెల్ **మిగతా 2లో...**

## ఉపాధి పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**పేద ప్రజలంతా ఏకం కావాలి**

**: ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పిలుపు**



**న్యూఢిల్లీ:**కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వీబీ-జీఆర్‌ఎంజీ చట్టానికి వ్యతిరేకంగా, ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు పేదలంతా ఐక్యంగా పోరాడాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపు నిచ్చారు. "మూడు నల్ల వ్యవసాయ చట్టాలను" తీసుకువచ్చినట్టే, ఎంజీఎన్ ఆర్‌ఈజీఏ ను రద్దు చేయడం కూడా మోడీ ప్రభుత్వ లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. వీబీ-జీఆర్‌ఎంజీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఇందుకు పేద ప్రజలంతా ఏకం కావాలని ఆయన కోరారు. **మిగతాది 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# ధాన్యం దిగుబడితో పాటు.. కొనుగోలులోనూ రికార్డు

**(మొదటి పేజీ తరువాయి)**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. పౌరసరఫరాల శాఖా,నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధించామని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లో లేవని ఆయన తెలిపారు. 2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధర తో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం 18,532.98 కోట్ల రూపాయలను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు పక్రియ ముగిసిందని ఆయన వివరించారు. అందుకు పౌర సరఫరాల శాఖ సిబ్బంది పని తీరును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అధిక దిగుబడులతో పాటు రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేయడంతో పాటు తెలంగాణా బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న డిమాండ్ ను పట్టి విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు గాను రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకతను ఆయన వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు పక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు.అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని,అంటే రాష్ట్ర జనాభాలో 85? లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు.అర్హులైన ప్రతి లబ్దిదారుకు నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ మీద 13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఆయన తెలిపారు.

÷-రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి క్లళెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు. ధాన్యం కొనుగోళ్ల పక్రియ సీజన్ కు సీజన్ కు పెరుగుతున్న నేపద్యంలో అందుకు అనుగుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్ధ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితము అయ్యిందని,ఈ గోదాములను భారత ఆహార సంస్థ,రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుందని అయితే నాణ్యతా లోపాలతో నిల్వ ఉంచిన బియ్యం చెడి పోయి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు.

÷ళిందప్రభుత్వం సహకారంతో పాటు ప్రైవైట్ సంస్థల భాగస్వామ్యం తో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు.. ఆధునికీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నష్టానివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అయితే ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు. బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణా రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని,ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల పక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. అటువంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గాను స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు ఆవశ్యకతను ఆయన సూచించారు. అదే విదంగా మిల్లింగ్ రంగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే మాత్రం చర్యలు కఠినాత్మకంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిబంధనల అమలులో సిబ్బంది కఠినంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. అదే సమయంలో డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే

# నైని కోల్ బ్లాక్ టెండర్లపై విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**

శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందానికి కేంద్రం మూడు రోజుల సమయం ఇచ్చింది . మూడు రోజుల్లో సింగరేణిలో పర్యటించి.. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి.. ఆ నివేదికను కేంద్రానికి అందజేయాల్సి ఉంటుంది. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో తీవ్రమైన ఆరోపణలు రావడంతో దీనిపై స్పందించిన తెలంగాణ డిప్యూటీ సీఎం, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క టెండర్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే నైని బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) కూడా ప్రకటించింది. అయితే.. ఇంతకుముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈరోజు(గురువారం) సాయంత్రం 5:00 గంటల నుంచి బిడ్లు ప్రారంభం కావాల్సి ఉంది. పాలనాపరమైన కారణాలతో టెండర్లను రద్దు చేస్తున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఇదిలావుంటే

భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారని కేంద్ర మంత్రి విమర్శించారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగ పడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమిజ్గన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని,సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమిజ్గ్గ÷న్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని అభిప్రాయపడ్డారు.


అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన తెలంగాణ సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. ఆదర్శవంతమైన

మోడల్గా గుర్తింపు సాధించిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై అ4ఎఫ్‌ఈ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

# సోషల్ మీడియాకు పిల్లలను దూరం చేసే యోచన

## ఆస్ట్రేలియా తరహాలో కట్టడికి యత్నం
## సిఎం రేవంత్‌తో ప్రత్యేకంగా నారా లోకేశ్ భేటీ

దావోస్,జనవరి 22:: ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడం పై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించిందని, ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. దావోస్‌లో బ్లూమ్‌బర్గ్‌తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం' అని లోకేశ్ వెల్లడించారు. దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం అని లోకేశ్ తెలిపారు.



# ప్రైవేట్ బస్సు దగ్ధం..

**(మొదటి పేజీ తరువాయి)**

దాటి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ డీసీఎం డ్రైవర్ దైవదూతలా స్పందించాడు. తన వాహనాన్ని ఆపి, బస్సు అద్దాలు పగలగొట్టి ప్రయాణికులను బయటకు దూకాలని అప్రమత్తం చేశాడు. దీంతో ప్రయాణికులంతా కిటికీల నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు.ఈ క్రమంలో పది మందికి పైగా ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రతకు బస్సు, లారీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రయాణికుల లగేజీ మొత్తం కాలి బూడిదైంది. బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్, క్లీనర్‌ల మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, డీసీఎం డ్రైవర్ సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని, లేదంటే మృతుల సంఖ్య భారీగా ఉండేదని అధికారులు, ప్రయాణికులు చెబుతున్నారు.

# కర్ణాటక అసెంబ్లీలో రగడ..

**(మొదటి పేజీ తరువాయి)**అసలు ఏం జరిగిందంటే..అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్ కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది.దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సింపుల్ గా 'రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్ పై మండిపడ్డారు.అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సీఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆ కోటరీని నమ్మితే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు

**(మొదటి పేజీ తరువాయి)**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారి వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని, ఆ కోటరీ మాటలు నమ్మితే జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చిచెప్పారు.గత ఏడాది రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విజయసాయి రెడ్డి, ఆ నిర్ణయంపై యూ-టర్న్ తీసుకున్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని, జూన్ తర్వాత తన రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తానని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా ఈడీ అధికారులు తనను ప్రశ్నించారని, అయితే అసలు ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందని తాను భావించడం లేదని అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. మిథున్ రెడ్డి కోరిక మేరకు శ్రీధర్ రెడ్డి కంపెనీకి సిఫారసు చేసిన మాట వాస్తవమేనని, కానీ రూ.100 కోట్లు ఏర్పాటు చేయాలని జగన్ తనతో ఎన్నడూ చెప్పలేదని ఆయన కుండబద్దలు కొట్టారు.ఈ సందర్భంగా జగన్ చుట్టూ ఉన్న కోటరీపై విజయసాయి రెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. "జగన్ చుట్టూ ఉన్న కోటరీ పెట్టే వేధింపులు, అవమానాలు తట్టుకోలేకపోయాను. ఆ కోటరీయే నన్ను పొగబెట్టి నెమ్మదిగా పార్టీ నుంచి బయటకు పంపించింది. కోటరీలోని కొందరు ఇప్పటికీ తింటూనే ఉన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాకు ఇప్పుడు గౌరవం లేకుండా పోయింది. ఈ కోటరీ మాటలు నమ్మడం కొనసాగిస్తే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు" అని ఘాటుగా విమర్శించారు.తాను 'నంబర్ 2' అనే మాట వాస్తవమేనని, కానీ, కేవలం తనపై కేసులు వచ్చినప్పుడు, వాటిని ఎదుర్కోవడానికి మాత్రమే తనను నంబర్ 2గా ప్రచారం చేశారని వాపోయారు. కానీ లాభాలు పంచుకోవడంలో మాత్రం తన స్థానం వంద తర్వాతనే అని అన్నారు. ఇక 'ప్రలోభాలకు లొంగిపోయారు' అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, ఆ వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకుంటేనే తదుపరి ఆలోచన ఉంటుందని షరతు విధించారు.

టీడీపీ కూటమిని విడగొడితేనే జగన్‌కు మళ్లీ అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషణ చేశారు. తనకు విశాఖలో ఒక అపార్ట్‌మెంట్ తప్ప మరేమీ లేదని, ఏడాదిగా వ్యవసాయం చేసుకుంటున్నానని, సంబంధం లేని విషయాల్లో తనను ఇరికించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

# కేటీఆర్‌కు సిట్ నోటీసులు

**(మొదటి పేజీ తరువాయి)**

ఇంచార్జ్ సోమ భరత్ అందుకున్నారు. తాజాగా కేటీఆర్‌కు ఫోన్‌ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు నోటీసులు జారీ చేయడంతో ఆ పార్టీ వర్గాల్లో మరోసారి కలకలం రేగింది. రెండ్రోజుల క్రితమే బీఆర్ఎస్ కీలక నాయకుల్లో ఒకరైన హరీశ్‌రావును ఇదే కేసులో సిట్ అధికారులు ఏడు గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్‌ను పిలవడంతో ఈ కేసు లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం సాగిన కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మునిసిపల్, ఐటీ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు. కాగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఐ న్యూస్ ఛానెల్ సీఈఓ శ్రవణ్‌రావుతో పాటు ఈ కేసులో ఇప్పటికే అరెస్టై బెయిల్‌పై విడుదలైన పోలీసు అధికారులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, బుజంగరావు, రాధాకిషన్‌రావుల విచారణ లో ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి వెల్లడించిన అంశాలను ముందు ఉంచుకొని కేటీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉందని తెలిసింది. కాగా కేటీఆర్‌ను ప్రశ్నించే సందర్భాన్ని పురస్కరించుకొని జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం తో పాటు పరిసర ప్రాంతాల్లో పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కేటీఆర్‌ను విచారించే విషయమై సిట్ అధిపతి, నగర పోలీసు కమిషనర్ వి.సి సజ్జనార్ తమ విచారణ బృందంలోని అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ విచారణలో తమ టీంలోని ఏయే అధికారులు పాల్గొనాలన్న విషయమై శుక్రవారం ఉదయం నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.

# ఉపాధి పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

గురువారం నాడిక్కడ జవహర్ భవన్‌లో నిర్వహించిన ఎంజీఎన్ఆర్ ఈజీఎ కార్మికుల జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎంజీఎన్ ఆర్ఈజీఎ అంటేనే పేదలకు హక్కులు కల్పించడమని అన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశానికే చరమగీతం పాడాలని ప్రధాని మోడీ కోరుకుంటున్నారని రాహుల్ విమర్శిం చారు. పేద ప్రజలందరికీ పని హక్కును ఎంజీఎన్ఆర్ఈజీఎ కల్పిస్తే, దాన్ని దెబ్బతీయడమే బీజేపీ, మోడీ కోరిక అని తప్పుబట్టారు. "అవసరమైన వారికి పని కల్పించాలనేది ఆలోచన. ఈ చట్టాన్ని ప్రభుత్వంలోని మూడవ అంచె పంచాయతీ రాజ్‌తో అమలు చేయాలి. పేదలందరికీ ఎంజీఎన్ఆర్ఈజీఎ కింద పని చేసే హక్కు ఉంది. ప్రధాని మోడీ- బీజేపీ ఆ భావనను పూర్తిగా రద్దు చేయాలని కోరుకుంటున్నాయి" అని అన్నారు. "కొన్నేండ్ల క్రితం బీజేపీ మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. దీని పేరుతో రైతులపై దాడి చేసింది. ఇప్పుడు కొత్త చట్టంతో వ్యవసాయ కార్మికులపై దాడి చేస్తోంది. అప్పుడు రైతులు, కార్మికులు అందరూ ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఆ నల్ల చట్టాలను రద్దు చేయించుకున్నాం. ఈ మూడు నల్ల వ్యవసాయ చట్టాలపై రైతులతో కలిసి వ్యవసాయ కార్మికులు, కార్మికులు కూడా పోరాడారు" అని రాహుల్‌గాంధీ గుర్తు చేశారు. కొత్త చట్టంతో, బీజేపీ పాలిత ప్రభుత్వాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత లభిస్తుందని, కేంద్రం పని, నిధుల కేటాయింపును నిర్ణయిస్తుందని అన్నారు. గతంలో కార్మికులు పొందే వాటిని, ఇప్పుడు కాంట్రాక్టర్లు, బ్యూరోక్రసీకి ఇచ్చారని విమర్శించారు."వారు (బీజేపీ) ఆస్తులు కొంతమంది చేతుల్లో ఉండాలని కోరుకుంటున్నారు. తద్వారా పేద ప్రజలు అదానీ-అంబానీపై ఆధారపడతా రు. అదే వారి భారతదేశ నమూనా" అని ఆయన విమర్శించారు.

# కాలిబాట నుండి కార్ల వరకు

## ఎడ్ల బండి నుండి హెలికాప్టర్ వరకు మేడారం రాకా

## హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు,**జనవరి22 ప్రజావినికిడి,** : మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండ కు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31 వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. గతంలో మహా జాతర సందర్భంగా అప్పటి పాలకులు నామమాత్రంగా నిధులు కేటాయించగా నేడు రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం గ్దదెల పునరుద్ధరణ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం 2 వందల 51 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. నేటి నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది.

# గ్రూప్-1పై తీర్పు వాయిదా

హైదరాబాద్,**జనవరి22 ప్రజావినికిడి,** గ్రూప్-1 పై గురువారం తెలంగా హైకోర్టు తీర్పు వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది. తీర్పు ఇంకా రెడీ కాలేదని హైకోర్టు డివిజన్ బెంచ్ వెల్లడించింది. గ్రూప్-1 పై వెలువరించాల్సిన తీర్పును వచ్చేనెల 5కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుతో 563 మంది గ్రూప్-1 అధికారుల భవితవ్యం తేలనున్నది. టీజీపీఎస్సీ 2024 లో గ్రూప్ 1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పరీక్షలో అవకతవకలు జరిగాయని హైకోర్టును ఆశ్రయించారు సెలెక్ట్ కాని అభ్యర్థులు. విచారణ అనంతరం సెలెక్షన్ లిస్టును రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది హైకోర్టు డివిజన్ బెంచ్. గత నెల 30 న పూర్తి వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్.. ఇవాళ నిర్ణయం వెల్లడించాల్సి ఉండగా వాయిదా పడింది.

# స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా భారత్

### సంసద్ ఖేల్ మహోత్సవ్ లో గవర్నర్




హైదరాబాద్,**జనవరి22 ప్రజావినికిడి,** ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మార్చాలని విజన్‌గా పెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడారు గవర్నర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని.. దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ వివరించారు. స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందని, యోగాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధాని మోదీ పాలసీలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో ఆయన నాయకత్వ సామర్థ్యం అద్భుతమైనదని కొనియాడారు జిష్ణుదేవ్ వర్మ. ఈశాన్య రాష్ట్రాల నుంచి అన్ని మెడల్స్ వస్తాయని ఊహించలేదని, త్రిపుర నుంచి ఒలింపిక్స్‌కు పోటీ పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ మంత్రి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఇంత స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని గవర్నర్ అభివర్ణించారు. క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ఇది వికసిత్ భారత్ కోసం వేసే ముందడుగు అని.. 'స్వస్థ భారత్, శ్రేష్ఠ భారత్'కు ఇది తొలి అడుగు అని గవర్నర్ ఉద్ఘాటించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పుణ్య క్షేత్రాలు వెళ్లాలంటే ఎంతో పుణ్యం చేసుకోవాలి

### అల్ మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలి






**ప్రజావినికిడి, (శంషాబాద్):జనవరి 22** పుణ్య క్షేత్రాలు వెళ్లాలంటే ఎంతో పుణ్యం చేసుకోవాలని అల్ మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ - ఫయాజ్ అలి అన్నారు.ఈ నెల 22వ తేది అర్ధరాత్రి సౌది ఎయిర్ లైన్స్ కు చెందిన విమానంలో వారు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరారు. భారత దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన ఇస్లామిక్ మతస్తులు ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్ళారు. యాత్రికులకు కుటుంబ సభ్యులు, బంధువులు విడ్కోలు పలికారు.అనంతరం మీడియా సమావేశంలో అల్ మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలి మాట్లాడుతూ,
చింతను వదలండి ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇస్లామిక్ మత పెద్దలు అంటున్నారు,అందుకే సంవత్సరానికి ఒకసారైనా పుణ్య క్షేత్రాలను దర్శించుకోవాలని ఇస్లామిక్ మత పెద్దలు సూచిస్తున్నారన్నారు.
భగవంతుని సన్నిధిలో కొన్నిరోజుల పాటు గడిపితే మనస్సు ప్రశాంతంగా ఉండడంతో పాటు వత్తిడి నుండి బయటకు వస్తారంటున్నారు.
50 మందితో కూడిన తమ బృందం ఉమ్రా యాత్రకు వెళుతున్నట్టు తెలిపారు.15 రోజుల పాటు మక్కా,మదీనా లలో ఉపవాస దీక్షలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు.పుణ్య క్షేత్రాలు వెళ్లాలంటే పుణ్యం చేసుకోవాలపని తెలిపారు.ప్రతి ఒక్కరికీ అలాంటి అదృష్టం ఉండదన్నారు.పుట్టిన ప్రతి ఒక్కరు ఉమ్రా యాత్ర చేయాలని కోరారు.రానున్న హజ్ యాత్రకు సంసిద్ధం కావాలని అన్నారు. సౌది ప్రభుత్వం హజ్ యాత్ర కోసం కొన్ని నియమాలు పెట్టిందని తెలిపారు.కాబట్టి ఎవరైతే హజ్ యాత్ర చేయాలనే కోరిక ఉందో తమను సంప్రదించాలని తెలిపారు.

# వసంత పంచమి పేరుతో అక్రమ అడ్మిషన్లు

## విద్య వ్యాపారం కాదు -టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్



**ప్రజావినికిడి, (శంషాబాద్):జనవరి 22,** వసంత పంచమి అనే పవిత్రమైన పండుగను ఉపయోగించుకొని, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్లు చేపడుతుండటం పై టి ఎస్ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ గారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం శంషాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,"వసంత పంచమి అనేది విద్య, జ్ఞానానికి ప్రతీక. అలాంటి పండుగను వ్యాపారంగా మార్చి, ముందస్తు అడ్మిషన్లు, డొనేషన్ల వసూలు చేయడం చట్టవిరుద్ధం. విద్య వ్యాపారం కాదు అది బాధ్యత, సేవ" అని స్పష్టం చేశారు. విద్యాశాఖ నిర్ణయించిన అడ్మిషన్ నిబంధనలు, కాలపరిమితులను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రులపై మానసిక ఒత్తిడి తెచ్చే విధానాలు అమలు చేయడం పూర్తిగా తప్పని ఆయన అన్నారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి,"మీ పిల్లల భవిష్యత్తును నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ దోపిడీ చేయనివ్వకండి ప్రభుత్వ నిబంధనలే పిల్లలకు రక్షణ కవచం" అని విజ్ఞప్తి చేశారు.అలాగే విద్యాశాఖ అధికారులను గౌరవపూర్వకంగా ప్రస్తావిస్తూ, "నిబంధనలను కఠినంగా అమలు చేస్తారని మాకు పూర్తి విశ్వాసం ఉంది. అక్రమ అడ్మిషన్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "న్యాయమైన విద్య కోసం విద్యాశాఖ, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలి. విద్యార్థుల హక్కుల కోసం టిఎస్ఎస్ ఓ ఎప్పుడూ ముందుంటుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ఓ సభ్యులుసర్వజిత్,నికేతిన్, విశ్వంత్,శ్రీధర్, గజానంద్,ఉదయ్, నీరజ్ పాల్గొన్నారు.

# బండ్ల గణేష్ చేపట్టిన సంకల్పయాత్రకు సంఘీభావం తెలిపిన ఎన్ఎండి ఫిరోజ్.



**ప్రజావినికిడి, తిరుపతి జనవరి 22:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిపై అపారమైన అభిమానంతో సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ దేవుడికి మొక్కు చెల్లించేందుకు షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు చేపట్టిన 'సంకల్పయాత్ర'కు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మార్గమధ్యలో బండ్ల గణేష్ ని కలుసుకుని సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా సంకల్పయాత్ర విజయవంతంగా పూర్తికావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ, ఆ భగవంతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి సంపూర్ణ ఆరోగ్యం, శాంతి, దీర్ఘాయుష్షు ప్రసాదించి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తిని ప్రసాదించాలని ఎన్ఎండి ఫిరోజ్ గారు కోరుకుంటున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతీ కమిషన్ ఛైర్ పర్సన్ తేజస్వి పాడపాటి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోండి

## బిల్లులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది -డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ

**కొమురం భీం,జనవరి22 ప్రజావినికిడి,**
ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధి దారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంద్భంగా భట్టి మాట్లాడుతూ.. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పనిలో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు. కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాడుకోవడం కోసం రుణాలు ఇచ్చే



నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు. కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# గిరిజన జాతర ..మేడారం !





**జనవరి22 ప్రజావినికిడి,**
కొయ్య సెక్కితే బొమ్మరా..కొలిచి మొక్కితే అమ్మరా..! అంటూ కవి అందెశ్రీ పాడిన పాట ఎంతో అద్భుత మైనది. అందులో ఆధ్మాత్మిక తత్వ చింతనను బాగా వెలవరించారు. భారతదేశ పురాణెతిహాసాల్లో విగ్రహాలు, దేవుళ్లు, పూజలు కూడా అంతా నమ్మకం, విశ్వాసం, భక్తిపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే చెట్టు, పుట్టా, గాలీ,నీరు, రాయిరప్పా అన్నీ మనకు దైవాలే. మనకు మేలుచేస్తున్న ప్రకృతిని దైవంగా కొలవడం ఒక్క భారతీయ సంస్కృతిలోనే చూస్తున్నాం. నమ్మకంతో పూజించడం మన ఆచారం. అది దేవత కావచ్చు..మైసమ్మ, మారెమ్మ ఇలా ఏ రూపంలో అయినా గ్రామదేవతనలు కొలవడం ఆచారంగా వస్తోంది. అలాంటి ఓ అద్భుతమైన ఆచారంతో కోట్లాదిమంది ఆరాధ్యదైవాలుగా వెలిసిన వారే సమ్మక్క-సారలమ్మలు. సామాన్యమైన గిరిజన కుటుంబానికి చెందిన వీరు అసామాన్యంగా భక్తులు మనస్సులో నిలిచిపోయారు. కేవలం గిరిజనుల నమ్మకం ఇప్పుడు సమస్త జనజాతికి నమ్మకంగా, ఆరాధ్యంగా ఆ దేవతలు వెలిశారు. రెండేళ్లకోమారు జరిగే మేడారాం గిరిజన జాతర చూస్తే..ఆ అమ్మలు జనహృదయంలో ఎంతగా గూడుకట్టుకున్నారో చెప్పలేం. ఇదంతా అమ్మల మీద ఉన్న గౌరవం కావచ్చు..నమ్మకం కావచ్చు.. విశ్వాసం కావచ్చు...కొలిచి మొక్కిన వారికి కొండంత వేల్పులుగా వారు నిలిచి పోయారు. గుడిలేదు.. గంటలు లేవు... కట్టుబాట్లు లేవు..పూజలు, ఆరాధనలు,,హారతులు వంటివి ఏవీ లేకుండా నేరుగా అమ్మలను తలచుకుని మొకకకుని రావడం అన్న ఆధ్యాతిక జాతర బహుశా ప్రపంచంలో ఎక్కడా కానరాదు. ప్రపంచం లోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రారంభం కాబోతున్నది. ప్రారంభానికి ముందే వేలాదిగా భక్తులు తరలివచ్చి గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్నారు. మేడారం అంటే గొప్ప జాతర .. రెండేళ్ల కొకసారి వన దేవతలు భక్తులకు దర్శనమిచ్చి ఆశీర్వదిస్తారు. ఇది కేవలం జాతర మాత్రమే కాదు.. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధికెక్కింది. జాతర వచ్చిదంటే తెలుగు రాష్ట్రాలతో పాటు.. భారతదేశం.. ప్రపంచవ్యాప్తంగా భక్తులు మేడారంలో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుంటారు. కుంభమేళా తర్వాత కోట్ల సంఖ్యలో భక్తులను ఆకర్షించే అతిపెద్ద ఉత్సవంగా నిలిచింది. నాలుగు రోజుల జాతరలో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది గద్దెలను అభివృద్ధి చేశారు. జాతరకు నెల ముందు నుంచే లక్షలాది మంది మేడారానికి పోటెత్తారు. నిజానికి వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లి-కూతుర్లు... తెలంగాణ ప్రాంతాన్ని కాకతీయ రాజులు సుమారు 700 సంవత్సరాలు పరిపాలించారు. సమ్మక్క సారలమ్మలు జగిత్యాల జిల్లా ప్రాంతానికి చెందిన గిరిజన జాతికి చెందినవారు. గిరిజనుల దొర మేడరాజు అడవిలో వేటాడుతుండగా.. ఒక పుట్టపై పులులు, సింహాలు కాపలాగా ఉన్న పసిపాప సమ్మక్కను చూసి.. ఆ పాపను తీసుకెళ్లి పెంచుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తుంది. అప్పటి వరకు కరువు.. కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు... సమ్మక్క రాకతో సమస్యలు తగ్గిపోయాయి. అంతేకాదు.. ఎలాంటి జబ్బునైనా ఆమె చేతి పసరుతో రోగాలు నయమయ్యా యని చెబుతుంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత సమ్మక్కను మేడారం పాలకుడు.... గిరిజన దొర...తన మేనల్లుడు అయిన పగిడిద్ద రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవనంలో సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు, జంపన్న అనే కుమారుడు కలిగారు. మేడరాజు పొలవాస ప్రాంతానికి కోయ రాజు కాగా... పగిడిద్ద రాజు మేడారాన్ని పాలించాడని చరిత్ర చెబుతోంది. కాకతీయ సామ్రాజ్యం విస్తరణలో భాగంగా, కాకతీయ మొదటి ప్రభువు మేడరాజు పాలించిన ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దండెత్తాడు. ఈ దాడిని తట్టుకోలేక మేడరాజు తన కుమార్తె సమ్మక్క దగ్గర మేడారంలో ఆశ్రయం పొందుతాడు. పగిడిద్ద రాజు కాకతీయుల సామంతుడిగా ఉంటూ, వారికి ప్రతి నెలా కప్పం కట్టేవాడు. మూడు సంవత్సరాలుగా ఏర్పడిన కరువుల వల్ల కప్పం కట్టలేకపోవడం... మేడరాజుకు ఆశ్రయం ఇవ్వడం వంటి కారణాలతో కాకతీయులు ఆగ్రహించి మేడారంపై దండెత్తారు. కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొనేంత బలం లేకపోయినా.. పగిడిద్ద రాజు, సమ్మక్క, సారక్క, వారి పిల్లలు సారలమ్మ, నాగులమ్మ, జంపన్నతో సహా కోయ ప్రజలంతా యుద్ధానికి సిద్ధమయ్యారు. బలమైన ఆయుధాలు, గుర్రాలు, ఏనుగులతో వచ్చిన కాకతీయ సైన్యంతో వందల సంఖ్యలో ఉన్న కోయ ప్రజలు బాణాలు, మొండి కత్తులతో భీకరంగా పోరాడారు. ఈ యుద్ధంలో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ వీరమరణం పొందారు. కుటుంబ సభ్యుల మరణాలను చూసిన జంపన్న.. అవమానాన్ని భరించలేక పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆ వాగును జంపన్న వాగుగా పిలుస్తున్నారు. తన కుటుంబ సభ్యులందరూ మరణించారని తెలిసిన సమ్మక్క, ఏమాత్రం వెనుకాడకుండా కాళీమాతలా విజృంభించి శత్రువులను ఎదుర్కొంది. అయితే, వెనుక నుంచి ఒక సైనికుడు దొంగచాటున పొడిచి సమ్మక్కను తీవ్రంగా గాయపరిచాడు. రక్తం కారుతుండగానే ఆమె చిలుకల గుట్ట వైపు వెళ్లి, నెమలినార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమ భరిణెగా మారి అదృశ్యమైందని చెబుతుంటారు. సమ్మక్క అదృశ్యమైన తర్వాత, గిరిజన ప్రజలకు ఆకాశం నుంచి కొన్ని మాటలు వినిపించాయి. 'ఈ గద్దమీద పుట్టిన ప్రతి ఒక్కరూ వీరుడిలా రాజ్యాన్ని పాలించాలని, ఇక్కడ రెండు గద్దెలు కట్టి రెండేళ్లకొకసారి ఉత్సవం జరిపిస్తే వారి కోరికలు నెరవేరుస్తాను' అని ఆ మాటల సారాంశం. ఈ మాటలను అమ్మ ఆదేశంగా భావించిన గిరిజనులు.. అప్పటి నుంచి అమ్మలకు జాతర నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంలో ఈ మహా జాతర జరుగుతుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరలో అనేక సంప్రదాయాలు పాటిస్తారు. మొదటిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకొస్తారు. రెండవ రోజు చిలుకల గుట్టలోని కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ దేవతలను గద్దెలపై ప్రతిష్ఠించే సమయంలో భక్తులు పూనకంతో ఊగిపోతారు. మూడవ రోజు అమ్మవార్లు సమ్మక్క, సారక్క ఇద్దరూ గద్దెలపై కొలువుతీరి భక్తులకు దర్శనమిస్తారు. నాలుగవ రోజు సాయంత్రం వారికి ఆవాహన పలికి తిరిగి వనప్రవేశం చేయిస్తారు. దీంతో మేడారం జాతర ముగుస్తుంది. ఈ పూజలను వంశపారంపర్యంగా గిరిజన పూజారులే నిర్వహిస్తారు. అమ్మవార్లకు బంగారంగా బెల్లాన్ని సమర్పించు కోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం.

## భోజ్‌శాలపై సుప్రీం కీలక ఆదేశాలు

### ఇరు మతస్థుల పూజలు, ప్రార్థనలకు అనుమతి



భోపాల్,**జనవరి22 ప్రజావినికిడి,** మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల ఆలయం-కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రార్థనల విషయంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాంతంలో శుక్రవారం హిందూ, ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. వసంత పంచమి సందర్భంగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ హిందూ మతస్థులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ ముస్లింలు శుక్రవారం ప్రార్థనలు చేసుకోవచ్చని అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాల్లో పేర్కొంది. నమాజ్ చేసుకునేందుకు వచ్చే ముస్లిం కమ్యూనిటీ వ్యక్తుల జాబితాను జిల్లా యంత్రాంగానికి అందజేయాల్సి ఉంటుందని సీజేఐ సూర్య కాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పాంచోలితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఇరువర్గాల వారు పరస్పరం గౌరవించుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని సూచించింది. భోజ్‌శాల 11వ శతాబ్దం నాటి కట్టడమని, సరస్వతీ దేవి ఆలయమని హిందువుల వాదనగా ఉంది. ముస్లింలు దీనిని కమల్ మౌలా మసీదుగా పిలుస్తుంటారు. 2003లో ఇందుకు సంబంధించి ఏఎస్ఐ ఆదేశాలు ఇచ్చింది. శుక్రవారం నమాజ్‌లు మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకూ చేసుకోవచ్చని, హిందువులు వసంత పంచమి పూజలు నిర్వహించుకోవచ్చని, ప్రతి మంగళవారం వారికి అనుమతి ఉంటుందని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. అయితే.. వసంత పంచమి శుక్రవారం నాడు వస్తే ఎలాంటి ఏర్పాట్లు చేయాలనేది అందులో పేర్కొనలేదు. ఈసారి జనవరి 23న వసంత పంచమి, శుక్రవారం కలిసి రావడంతో ఇరువర్గాలు తమ మతపరమైన ప్రార్థనలు నిర్వహించు కునేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరాయి.

## ఐదేళ్ల విధ్వంసానికి జగన్‌కు క్రెడిట్ ఇవ్వాల్సిందే

### జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి



అమరావతి**జనవరి22 ప్రజావినికిడి,**
అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగన్ ఏం చేశారని క్రెడిట్ ఇవ్వాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయడంలోనే నీకు క్రెడిట్. అంటూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై గొట్టిపాటి రవికుమార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. క్యారెక్టర్ లేని జగన్ క్రెడిట్ గురించి మాట్లాడుతున్నా రన్నారు. ఆయనకు ఇవ్వాల్సిన క్రెడిట్ ఏమిటో ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ప్రస్తావించారు. విద్యుత్ శాఖను సర్వనాశనం చేసినందుకు జగన్ రెడ్డికి కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాల్సిందే' అని వ్యంగాస్త్రాలు సంధించారు. రూ.30 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసినందుకు జగన్‌కు క్రెడిట్ ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచినందుకు.. పీపీఏలను రద్దు చేసినందుకు కచ్చితంగా మరో క్రెడిట్ ఇవ్వాలంటూ విమర్శలు గుప్పించారు. మళ్లీ ఏ మోహం పెట్టుకుని.. 'జగనే ఉండి ఉంటే...' అని మాట్లాడుతున్నావంటూ మాజీ సీఎంపై మండిపడ్డారు. జగన్ ఉండి ఉంటే ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారేదని, విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యేదని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు గొట్టిపాటి. రాష్ట్రాన్ని చోరీ చేసిన జగన్.. క్రెడిట్ చోరీ గురించి మాట్లాడితే జనం నవ్వుతున్నారంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి.

## చదువులతల్లి సరస్వతి పుట్టిన రోజు

### వసంత పంచమి పుణ్యతిథి శుభప్రదం

### అక్షరాభ్యాసాలకు ప్రత్యేకం





బాసర, **జనవరి22 ప్రజావినికిడి,**
మాఘ మాసం అంటేనే పర్వదినాలను మోసుకొచ్చేది. ఈ మాసంలో వచ్చే వసంత పంచమితో ఈ పర్వదినాలు ప్రారంభమవుతాయి. ఈ వసంత పంచమిని శ్రీపంచమి అని కూడా అంటారు. ఈ ఏడాది జనవరి 23న శుక్రవారం వసంత పంచమి వచ్చింది. సాక్షాత్తూ చదువుల తల్లి సరస్వతీ దేవి ఈ రోజే జన్మించిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రముఖ దేవాలయాలు.. బాసర, వర్గిల్, విజయవాడలోని కనక దుర్గమ్మ దేవాలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. ఈ రోజు చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే.. వారికి విద్యాబుద్ధులు వికసించి.. భవిషత్తులో ఉన్నత స్థానాలకు చేరతారని నమ్మిక. అందుకే ఈ రోజు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతారు. ఈ ఏడాది పంచమి తిథి జనవరి 23 శుక్రవారం తెల్లవారుజామున 2.28 గంటలకు ప్రారంభమవుతుంది. మర్నాడు అనగా.. శనివారం తెల్లవారుజామున 1.46 గంటలకు ముగుస్తుంది. సూర్యోదయం తిథిని ప్రామాణికంగా తీసుకుంటారు కనుక.. జనవరి 23న వసంత పంచమి జరుపుకోవాలని పండితులు స్పష్టం చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 7:15 నుంచి మధ్యాహ్నం 12:33 గంటలలోపు సరస్వతీ పూజకు మంచి సమయమని భక్తులకు సూచిస్తున్నారు. పురాణాల ప్రకారం.. బ్రహ్మదేవుడు యావత్ సృష్టికి వాక్కును అందించడానికి సరస్వతీ దేవిని ఈ రోజే.. వసంత పంచమి వేళ సృష్టించారని చెబుతారు. అందుకే ఈ మాఘ శుద్ధ పంచమి సరస్వతీ దేవి జన్మదినంగా పరిగణిస్తారు. విద్యార్థినీ విద్యార్థులతోపాటు సంగీత, సాహిత్య కళాకారులకు ఈ శ్రీ పంచమి గొప్ప పర్వదినమని అభివర్ణిస్తారు. ఆ క్రమంలోనే తమ చిన్నారులతో అమ్మవారి దేవాలయాలకు తల్లిదండ్రులు తరలివెళ్తారు. ఈ వసంత పంచమి వేళ జరిపే పూజల్లో పసుపు వర్ణానికి అధిక ప్రాధాన్యమిస్తారు. పసుపు రంగు.. వసంతకాలం రాకకు సంకేతంగా భావిస్తారు. అలాగే మనలోని జ్ఞానానికి పసుపు వర్ణం సంకేతం. అందుకే ఈ రోజు సరస్వతీ దేవిని దర్శించుకునే భక్తులంతా పసుపు రంగు దుస్తులు ధరిస్తారు. అంతేకాకుండా ఈ రోజు పలు శుభకార్యాలకు అనుకూలమైన తిథి అని పండితులు వివరిస్తారు. అమ్మవారికి.. పసుపు రంగులో ఉండే కేసరి, పులిహోర, పసుపు రంగు తీపి పదార్థాలను నైవేద్యంగా నివేదిస్తారు. వసంత పంచమి రోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం ఎంతో శుభప్రదం. అందుకే తెలంగాణలోని నిర్మల్ జిల్లాలోని బాసర క్షేత్రంలో ఈ వసంత పంచమి రోజు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం కోసం వేలాదిగా భక్తులు తరలి వస్తారు. ఈరోజు కేవలం అక్షరాభ్యాసాలకు మాత్రమే కాదు.. కొత్త పని ప్రారంభాలకు, వ్యాపారం ప్రారంభానికి, పిల్లలకు పుట్టి వెంట్రుకలు తీయడానికి, అన్నప్రాసన చేయడానికి, నూతన గృహప్రవేశాలు వంటి అనేక శుభకార్యాలకు అత్యంత అనుకూలమైన తిథిగా పండితులు చెబుతారు. ఈరోజున సరస్వతి గుడికి వెళ్లి అమ్మవారికి పూజలు చేయడం, ఇంట్లో సరస్వతీ దేవి పూజ చేయడం, సరస్వతి మంత్రాలు చదవడం, చదువుకునే పిల్లలు మనసులో కోరికలను అమ్మవారికి చెప్పుకోవడం వల్ల సరస్వతీ దేవి అనుగ్రహం కలుగుతుందని విశ్వాసం. అంతే కాకుండా ఈ వసంత పంచమి రోజు ఎవరైతే సరస్వతి దేవికి పూజ చేస్తారు వారికి అమ్మవారి ఆశీస్సులతో పాటు ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తి పెరిగి చదువులపై మనసు లగ్నం చేయగలుగుతారని మన పురాణాల్లో చెప్పబడింది. అంతేకాకుండా ఈరోజు చేసే దానాలకు కూడా విశేషమైన ప్రాముఖ్యత ఉంది. అందుకే ఈ వసంత పంచమి రోజు విద్యార్థులు పెన్నులు, బలపాలు, పుస్తకాలు, పెన్సిళ్లు వంటివి తోటి విద్యార్థులకు దానం చేస్తారు. వసంత పంచమి రోజున పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం అత్యంత శుభప్రదమని పండితులు చెబుతున్నారు. ఈ రోజున చదువు ప్రారంభిస్తే పిల్లలు విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పండితులు చెబుతున్నారు. పురాణాల ప్రకారం వసంత పంచమి అనేది జ్ఞాన దేవత సరస్వతి దేవి పుట్టిన రోజు కావడంతో పాటు వసంత రుతువు కూడా ప్రారంభమవుతుంది. అక్షరాభ్యాసానికి ముహూర్తంతో సంబంధం లేకుండా చూడకుండా అక్షరాభ్యాసాలు చేస్తారు. ఆరోజు సరస్వతి దేవి చదువుల తల్లి పుట్టిన రోజు కాబట్టి సరస్వతీ దేవి ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుస్తకాలు, పెన్నులు, బలపాలు వంటి విద్యాసంబంధిత వస్తువులను దానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తి...వీటి స్వరూపమే సరస్వతీదేవి. అమ్మ అనుగ్రహం ఉంటే సద్బుద్ధిని పొందుతారు..

## ఆర్ యూ డెడ్?

### ఒంటరితనానికి మందు ఈ చైనీస్ యాప్!

### చైనాలో పెరుగుతున్న ఒంటరితనాన్ని ఎదుర్కొనేందుకు కొత్త యాప్






**జనవరి22 ప్రజావినికిడి,**
చైనాలో పెరిగిపోతున్న ఒంటరితనం, సామాజిక ఏకాంతాన్ని ఎదుర్కొనేందుకు ఓ వినూత్న యాప్ అందుబాటులోకి వచ్చింది. తగ్గుతున్న వివాహాలు, జననాల రేటు నేపథ్యంలో ఒంటరిగా జీవించే వారి సంఖ్య పెరుగుతుండటంతో, వారి భద్రతను లక్ష్యంగా చేసుకుని 'ఆర్ యూ డెడ్?' పేరుతో ఈ యాప్‌ను రూపొందించారు. మూన్‌స్కేప్ టెక్నాలజీస్ అనే సంస్థ అభివృద్ధి చేసిన ఈ యాప్‌ను 'ఒంటరిగా నివసించే వారి కోసం రూపొందించిన తేలికపాటి భద్రతా సాధనం' అని అభివర్ణించవచ్చు. ఈ యాప్‌లో యూజర్లు ప్రతిరోజూ ఓ పెద్ద ఆకుపచ్చ బటన్‌ను నొక్కి 'చెక్-ఇన్' చేయాల్సి ఉంటుంది. ఒకవేళ వరుసగా రెండు రోజులు చెక్-ఇన్ చేయడంలో విఫలమైతే, వారు ముందుగా నమోదు చేసుకున్న అత్యవసర కాంటాక్ట్‌కు ఆటోమేటిక్‌గా ఒక అలర్ట్ వెళుతుంది.గార్డియన్ కథనం ప్రకారం, చైనాలో 20, 30 ఏళ్ల వయసులో ఉన్న యువత ఎక్కువగా ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. 2024లో దేశంలో కేవలం 61 లక్షల జంటలు మాత్రమే వివాహం చేసుకోగా, 26 లక్షల జంటలు విడాకులకు దరఖాస్తు చేసుకున్నాయి. మరోవైపు, జననాల రేటు గణనీయంగా పడిపోవడంతో దేశం జనాభా సవాళ్లను ఎదుర్కొంటోంది. 2030 నాటికి చైనాలో ఒంటరిగా నివసించే వారి గృహాలు 20 కోట్లకు చేరవచ్చని ప్రభుత్వ మీడియా అంచనా వేస్తోంది.
ఈ నేపథ్యంలో, ఒంటరిగా చనిపోతామేమోనన్న ఆందోళనను ఈ యాప్ కొంతవరకు తగ్గిస్తోందని యూజర్లు అభిప్రాయపడుతున్నారు. దేశంలో '9-9-6' (ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు, వారానికి ఆరు రోజులు) పని సంస్కృతి కూడా ఒత్తిడి, సామాజిక ఒంటరితనానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ యాప్ ప్రజలను ఇతరులతో కనెక్ట్ చేయడానికి సహాయపడుతుందని మానసిక ఆరోగ్య నిపుణులు కూడా చెబుతున్నారు. "ఒంటరిగా జీవించడం అనేది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ధోరణి. వారి భద్రతా సమస్యలపై ప్రపంచం దృష్టి పెట్టాలని ఆశిస్తున్నాను" అని యాప్ సహ వ్యవస్థాపకుడు ఇయాన్ లూ తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ వ్యాఖ్యల దుమారం

## అక్కడ ఏం జరుగుతుందో మాకనవసరం -ట్రంప్ వ్యాఖ్యలకు రష్యా అధినూత కౌంటర్



మాస్కో,**జనవరి22 ప్రజావినికిడి,** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గ్రీన్‌లాండ్ భద్రతకు చైనా, రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని చేసిన ఆరోపణలను మాస్కో తిప్పికొట్టింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ భద్రతా మండలి సమావేశంలో పుతిన్ స్పందిస్తూ.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'గ్రీన్‌లాండ్‌లో ఏం జరుగుతుందో మాకు అనవసరం. మొదటి నుంచి గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ ఒక చిన్న ప్రాంతంగానే చూసింది. ప్రస్తుతానికి ఈ అంశంపై ఎవరికీ పట్టింపు, ఆసక్తి లేదని నా ఉద్దేశం' పుతిన్ చెప్పారు. ఎవరెన్ని రకాలుగా బెదిరించినా.. ఈ విషయంలో రష్యా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రీన్‌లాండ్ వ్యవహారం అమెరికా, డెన్మార్క్‌లు కలిసి పరిష్కరించుకుంటాయని పుతిన్ చెప్పారు. 1917లో డెన్మార్క్.. వర్జిన్ దీవులను అమెరికాకు విక్రయించింది. 1867లో రష్యా.. అలస్కాను యూఎస్‌కు 7.2 మిలియన్ డాలర్లరకు అమ్మిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు పుతిన్. గాజాలో యుద్ధాన్ని అంతం చేయడానికి ట్రంప్ ప్రతిపాదించిన 'బోర్డ్ ఆఫ్ పీస్'పై కూడా పుతిన్ స్పందించారు. ఈ విషయంపై విదేశాంగ మంత్రిత్వ శాఖకు అందిన పత్రాలను పరిశీలించాలని ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థిరత్వాన్ని బలోపేతం చేయడం, ప్రపంచ శాంతి భద్రత కోసం చేసే ప్రయత్నాలకు రష్యా ఎప్పుడూ మద్దతిస్తుందన్నారు. గాజా శాంతి ప్రణాళికకు 1 బిలియన్ డాలర్ల సొమ్ము విరాళంగా ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా పుతిన్ ప్రకటించారు.

# గద్దర్ అవార్డులు

## ఫిబ్రవరి 3లోగా దరఖాస్తులకు ఆహ్వానం



హైదరాబాద్,**జనవరి22 ప్రజావినికిడి,** 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ గద్దర్ అవార్డులకు అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31, 2026 వరకు పొందవచ్చని, తగిన డాక్యుమెంట్లతో కూడిన ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.ఈ అవార్డుల వివరాలు వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను కోరారు.

# రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగం

## లక్ష సిసి కెమెరాల ఏర్పాటు లక్ష్యం
## ఇప్పటికే 14వేలు పూర్తి చేసిన ప్రభుత్వం
## జిల్లా కలెక్టర్లతో సిఎస్ విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్



అమరావతి**జనవరి22 ప్రజావినికిడి,** రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 14 వేలకు పైగా కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ ఉల్లంఘనలను అదుపు చేసేందుకు సీసీటీవీ కెమెరాలను రియల్ టైం గవర్నెన్ కేంద్రంతో అనుసంధానించి పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వపరంగా వివిధ ముఖ్య కూడళ్ళు, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలు తదితర చోట్ల ఏర్పాటు చేసిన 14వేల సీసీటీవీ కెమెరాలు అన్నీ సక్రమంగా పని చేసేలా చూడాలని కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సీసీటీవీ ప్రాజెక్టు, డాక్యుమెంట్ అఎ÷-లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ అంశాలపై ఏపీ సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.

అయితే, జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలన్నీ సక్రమంగా పని చేసేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరించి సీసీటీవీలు అన్నీ కెపనిచేసేలా చూడాలన్నారు. ఇక, వివిధ పట్టణ ప్రాంతాల్లో 123 సీసీటీవీ కెమెరాలు పని చేయడం లేదని గుర్తించినట్లు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యకర్శి కె. సురేష్ కుమార్ వివరించారు. వెంటనే అన్ని పని చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనంగా మరో 188 కొత్త కూడళ్ళను గుర్తించి అక్కడ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుకు ఇప్పటికే ఏజెన్సీకి పనులు అప్పగించడం జరిగిందని, జిల్లా కలెక్టర్లతో తరచు ఈ అంశంపై సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలే కాకుండా సీఎస్ఆర్ నిధులతోనూ, ఇతర విధంగాను ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను కూడా నియంత్రణలోకి తీసుకుని సక్రమంగా పని చేసేలా చూడాలని సీఎస్ విజయానంద్ సూచించారు.

# కారులో తరలిస్తున్న ఎర్రచందనం పట్టివేత

రైల్వే కోడూరు,జనవరి 22: అక్రమంగా కారులో తరలిస్తున్న 28ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే కోడూరు టాస్క్ ఫోర్స్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో నెల్లూరు- గూడూరు మార్గంలో వెళుతున్న వాహనాలను తనిఖీ చేపట్టారు. వీరు వెంకటాచలం చెక్ పోస్టు వద్దకు చేరుకోగా, ఒక మోటారు సైకిల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, వీరితో పాటు వెనకే వస్తున్న ఒక కారును అడ్డగించి,కారును ఆపిన వెంటనే అందులోని వ్యక్తులు దిగి పారిపోయే ప్రయత్నం చేయగా టాస్క్ ఫోర్సు పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని కారులో తనిఖీ చేయగా అందులో 28ఎర్రచందనం దుంగలు లభించాయని అన్నారు. నలుగురిని నెల్లూరు,తిరుపతి జిల్లాలకు చెందిన వారిగా గుర్తించి వీరిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

----------

# తిరువనంతపురం-చర్లపల్లి మధ్య అమృతభారత్

## నేడు కేరళలో జెండా ఊపనున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి 22(: తెలుగు రాష్ట్ర రైల్వే ప్రయాణికులకు శుభవార్త. మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలుగు ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ అమృత్ భారత్ రైలు నడవబోతోంది. 23న శుక్రవారం కేరళ రాజధాని తిరువనంతపురం నుంచి ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. తిరువనంతపురం- చర్లపల్లి మధ్య ఈ అమృత భారత్ రైలు నడవనుంది. అప్పటికే చర్లపల్లి-ముజఫర్ పూర్ (బీహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. తిరువనంతపురం- చర్లపల్లి మధ్య నడిచే ఈ రైలు తెలంగాణకు కేటాయించిన రెండో అమృత్ భారత్ రైలు. ఈ రైలు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి ఉదయం 7.15కు బయలుదేరి.. మరుసటి రోజు (బుధవారం) మధ్యాహ్నం 2.45కు తిరువనంతపురం చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరిగి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి, తర్వాతి రోజు రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రైలు తెలంగాణలోని నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆధునిక పద్ధతుల్లో, స్వదేశీ సాంకేతికతతో డిజైన్ చేశారు. వివిధ సౌకర్యాలను అందించే ఈ రైళ్లు అందుబాటు ధరల్లోనే ప్రయాణికులకు సేవలు అందించబోతున్నాయి.

# ప్రమాద ఘటనపై దర్యాప్తు వేగవంతం

## సంఘటనా స్థలాన్ని పరిశీలించి,సహాయక చర్యల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్

### .... క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా ఎస్పీ





**నంద్యాల క్రైంజనవరి22 ప్రజావినికిడి,**
జిల్లా పరిధిలోని ఆళ్లగడ్డ నంద్యాల జాతీయ రహదారిలో శిరివెళ్ల సమీపంలో నెల్లూరు నుండి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్ కు వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శిరివెళ్లమెట్ట వద్ద నిన్న అర్ధరాత్రి సమయంలో బస్సు టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకెళ్లి రోడ్డు అవతలివైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని దగ్ధమైంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా 36 మంది సురక్షితంగా బయటపడ్డారు.పలువురు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించాయి. బస్సు క్లీనర్, బస్సు అద్దాలను పగులగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సంఘటన తెలుసుకున్న జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ వెంటనే సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లను, అంబులెన్సును సంఘటన స్థలానికి పంపించి తాను కూడా చేరుకొని పరిస్థితిని పరిశీలించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అనంతరం బస్సు కిటికీలో నుంచి దూకిన కొందరు ప్రయాణికులకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి క్షతగాత్రులను పరామర్శించి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. అక్కడి ప్రయాణికులతో మాట్లాడి కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సురక్షితంగా వారి ప్రదేశాలకు వెళుటకు తగిన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్, శిరివెళ్ల ఇన్స్పెక్టర్ రాము, పలువురు పోలీస్ అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ లో సమ్మె నోటీసు

## ఫిబ్రవరి 12న సమ్మెకు నిర్ణయం



**విశాఖపట్టణం,జనవరి22 ప్రజావినికిడి,**
విశాఖ స్టీల్ ప్లాంట్ లో సమ్మె నోటీసును ఇచ్చారు. స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు గురువారం యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తారీకు ఉదయం 6 గంటల నుండి 13 వ తారీకు ఉదయం 6 గంటల వరకు సమ్మె నిర్వహిస్తున్నామని వారు అన్నారు. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 శాతం వ్యూహాత్మక అమ్మకాన్ని తక్షణమే ఉపసంహరించుకొని సెయిల్ లో దీనిని కలపాలని లేదా సొంత గనులు కేటాయించాలని దీనిని బలోపేతం చేయడానికి ఆప్ స్ట్రీమ్ డౌన్ స్ట్రీమ్ లను ఆప్టిమైజేషన్ చేయాలని వారి డిమాండ్ చేశారు. దీనిని బలహీనపరిచే విధంగా ఈవోఐ లను ప్రకటించిన ప్రభుత్వ యాజమాన్యాలు దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు అన్నారు. అలాగే కార్మికులకు పూర్తి జీతాన్ని చెల్లించాలని, ప్రొడక్షన్ లింక్ జీతాలను చెల్లించే సర్కులర్ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, బకాయి పడిన 355శాతం జీతాన్ని చెల్లించాలని, నిలుపుదల చేసిన హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలని, ఉక్కు నగరంలో కరెంటు చార్జీలు తగ్గించాలని, ఆర్థిక మరియు వెల్ఫేర్ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని. గ్రాట్యుటీ 25 లక్షలు గా చెల్లించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ లో నిర్వాసితులచే ఖాళీలు భర్తీ చేయించాలని, ఎ÷-లాంట్లో భద్రత మరియు హాస్పటల్ సౌకర్యాలను మెరుగుపరచాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేస్తున్నామని వారు వివరించారు. మన జీతాలు హక్కుల కోసం జరుగుతున్న ఈ సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు కె ఎస్ ఎన్ రావు, రమణమూర్తి, జె అయోధ్యరామ్, దాలి నాయుడు, సిహెచ్ సన్యాసిరావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన చంద్రబాబు దావోస్ పర్యటన

## నాలుగు రోజుల పాటు బిజీగా కార్యక్రమాలు
## దిగ్గజ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు
## నేటి ఉదయం హైదరాబాద్‌కు చేరిక



అమరావతి,జనవరి 22:):దావోస్ పర్యటన ముగించుకుని స్వదేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బయల్దేరారు. శుక్రవారం ఉదయం 8.25 నిమిషాలకు హైదరాబాద్ కు చేరుకోనున్నారు. మొత్తంగా నాలుగు రోజుల దావోస్ పర్యటనలో 36కు పైగా కార్యక్రమాలకు సీఎం హాజరయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో 3 సమావేశాల్లో పాల్గొన్న చంద్రబాబు.. ప్రపంచ ఆర్థిక సదస్సు వేదిక వద్ద ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ సహా 16 దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో నిర్వహించిన 9కి పైగా సెషన్స్, సమావేశాల్లో పాల్గొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదిక నుంచి ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామిక వేత్తల ఆలోచనలు తెలుసుకునేందుకు ఉపకరించాయని సీఎం చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, ఆంధప్రదేశ్ బ్రాండ్ ను మరింత విస్తరించేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పాలసీలను అంచనా వేసేందుకు కూడా సదస్సు దోహదం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2025 దావోస్ పర్యటన ద్వారా ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారం అయ్యాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, టూరిజం లాంటి రంగాల్లో ఏపీ సాధిస్తున్న విజయాలను వనరుల్ని సమర్థంగా వివరించామని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్ వైపు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. యువ శక్తి, సమర్థ నాయకత్వం, పాలసీల కారణంగా ప్రస్తుతం ప్రతీ రంగంలో భారత్ లో కంపెనీలకు అవకాశాలు పెరుగుతున్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.ఇక, యూరప్ లోని తెలుగు ప్రజలతో మమేకం అవుతూ తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో చంద్రబాబు ఆత్మవిశ్వాసం నింపారు.

# రాష్ట్ర రబ్బీకి పూలె పాఠశాల క్రీడాకారుల ఎంపిక



**వరంగల్ /జనవరి22 ప్రజావినికిడి,** ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్14 రబ్బీ ఎంపిక పోటీలు నర్సంపేట మినీ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలె బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.పోటీల్లో పాఠశాల నుంచి పాల్గొన్న ఐదుగురు క్రీడాకారుల్లో ఎ. చరణ్ తేజ్, యం. పవన్ (తొమ్మిదవ తరగతి), రిషిత్ (ఎనిమిదవ తరగతి) ఉత్తమ ప్రదర్శనతో ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23, 24 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి రబ్బీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి రాజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరునగిరి శ్రీలత, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయుడు సందీప్ అభినందించారు

# ముల్కనూర్ సమ్మక్క సారక్క ఆలయ చైర్మన్‌గా జక్కుల ఐలయ్య



**భీమదేవరపల్లి/జనవరి22 ప్రజావినికిడి,** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సమ్మక్క సారక్క ఆలయ చైర్మన్‌గా జక్కుల ఐలయ్యను నియమిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ జక్కుల ఐలయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తనను జాతర చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీలోని సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు సహా తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధికి, మొబైల్ బాత్రూముల ఏర్పాటు, ఆలయ మరమ్మత్తులకు సహకరిస్తున్న మంత్రివర్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్లుగా గీకురు ఐలయ్య, మాడుగుల యాదగిరి, గుడి కందుల రాజు, పెంచికల జైపాల్, వంగ శ్రీనివాస్ గౌడ్, కుదురుపాక శ్రీనివాస్, పెంటపుర్తి వీరారెడ్డి, మారుపాటి శ్రీనివాస్ రెడ్డి, మద్ది వేణుగోపాల్, మాలోతు మొగిలి, చిదురాల విజయ రెడ్డి, ఎలుకపల్లి రామారావు, మాడుగుల మధుకర్ నియమితులయ్యారు. ముల్కనూర్ గ్రామ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి గారి సహకారంతో, తన చైర్మన్ పదవీకాలంలో రాబోయే సమ్మక్క సారక్క జాతరకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రత, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వసతులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

## వాహనదారుల సురక్షిత ప్రయాణమే

# లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం.

### -గార్ల బయ్యారం సీఐ రవీందర్.




**బయ్యారం/జనవరి22 ప్రజావినికిడి,**
రోడ్డు ప్రమాదాలను తగ్గించి వాహనదారుల సురక్షిత ప్రయాణాలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్అలైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గార్ల బయ్యారం సీఐ రవీందర్ తెలిపారు.జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశానుసారం గురువారం మండల లారీ అసోసియేషన్ వద్ద అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ లో భాగంగా గార్ల బయ్యారం సీఐ ఎల్.రవీందర్ పాల్గొని వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలను వివరించి మండలంలో గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాలు గురించి వివరిస్తూ దానికి గల కారణాలను వివరించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సీట్ బెల్ట్ ధరించాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని నిర్లక్ష్యంగా అతివేగంగా వాహనాల నడపరాదని మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకూడదని సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని ఓవర్ లోడ్ వాహనాలను నడపారాదని సూచించారు.ఈ కార్యక్రమంలో బయ్యారం ఎస్సై కే. తిరుపతి,బయ్యారం పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య



**నెక్కొండ /జనవరి22 ప్రజావినికిడి,** :నెక్కొండ మండలం తోపనపెల్లి గ్రామానికి చెందిన బిక్షం పదవ రోజు కార్యక్రమానికి వర్ధన్నపేట వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా బిక్షం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం బిక్షం కుమారుడు బొల్లపెల్లి సురేష్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎం.డి. అక్బర్, వార్డు సభ్యులు ఎం.డి. రషీద్, ఎలికట్టె చిన్న రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు తాటికయాల కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ నాయకుడు రాసురి శారద లింగం తదితరులు పాల్గొన్నారు.

# బ్రాండ్ ఏపీకి ప్రపంచ ఖ్యాతి

### పలువురు గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో సమావేశం

### భారత్‌లో పెట్టుబడులపై పెరిగిన ఆసక్తి అని వెల్లడి

### రాష్ట్రంలో కీలక ప్రాజెక్టుల పురోగతిపై చర్చలు




అమరావతి,**జనవరి22 ప్రజావినికిడి,**
దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (ఔజుఖీ) సదస్సులో తన పర్యటన విజయవంతమైందని, ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ బ్రాండింగ్‌ను ప్రోత్సహించేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటనను ముగించుకుని గురువారం ఆయన ఈ విషయాలను వెల్లడించారు. మారుతున్న ప్రపంచ పారిశ్రామిక రంగంలోని ధోరణులను, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక దిగ్గజాల దృక్పథాలను అర్థం చేసుకోవడానికి ప్రపంచ ఆర్థిక వేదిక ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.గత మూడు రోజులుగా జరిగిన వివిధ సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయం, పర్యాటకం వంటి కీలక రంగాల్లో రాష్ట్రం సాధించిన. విజయాలను, ప్రగతిని సమర్థవంతంగా ప్రపంచానికి తెలియజేశామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రపంచ కార్పొరేట్ దిగ్గజాలు భారత్‌పై అధిక ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం (జమీూ) ఒక ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో ఉన్న యువశక్తి, సమర్థవంతమైన నాయకత్వం, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాల కారణంగా అన్ని రంగాల్లోనూ కంపెనీల స్థాపనకు అవకాశాలు గణనీయంగా పెరిగాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ సానుకూల వాతావరణాన్ని అందిపుచ్చుకుని ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తన పర్యటన సాగిందని ఆయన స్పష్టం చేశారు.ఈ పర్యటనలో భాగంగా విశాఖపట్నంలోని టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ పురోగతి, అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ, కర్నూలులో ప్రతిపాదించిన సౌర విద్యుత్ ప్రాజెక్టులపై ఫలవంతమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సాంకేతిక, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.నాలుగు రోజుల దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత చురుకుగా పాల్గొన్నారు. ఆయన మొత్తం 36కు పైగా సమావేశాల్లో పాల్గొన్నారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతో మూడు కీలక సమావేశాలు నిర్వహించారు. ప్రపంచ ఆర్థిక వేదిక ప్రాంగణంలో 16 మంది ప్రపంచ స్థాయి పారిశ్రామిక దిగ్గజాలతో ముఖాముఖి సమావేశమయ్యారు. అలాగే, తొమ్మిదికి పైగా సెషన్లు, ఇతర సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడంలో దోహదపడతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింతగా ప్రచారం చేసేందుకు రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ విధానాల ప్రభావాన్ని అంచనా వేయడంలో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు కీలకపాత్ర పోషించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా, యూరప్‌లో నివసిస్తున్న తెలుగు ప్రవాసులతో ప్రత్యేకంగా సమావేశమై వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు.
దావోస్ సదస్సు వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రపంచానికి వివరించారు. మొత్తం మీద, ఈ పర్యటన రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేయడమే కాకుండా, భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**క్యాప్ జెమిని సీఈఓతో నారా లోకేశ్ భేటీ**

క్యాప్ జెమిని సీఈవో ఐమన్ ఎజ్జట్‌తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖపట్నంలో ఇంటిగ్రేటెడ్ ఐటీ డెవలప్ మెంట్ సెంటర్, జీసీసీ, వర్టికల్ బీపీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ యూనివర్సిటీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (=×ు)తో కలిసి పనిచేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనపై. క్యాప్ జెమిని సీఈవో సానుకూలంగా స్పందించారు. భారత్ లో ఏఐ, క్లౌడ్-రెడీ వర్క్‌ఫోర్స్ కోసం 45 వేల మంది ఉద్యోగుల నియామక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఇది త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# చంద్రబాబుది క్రెడిట్‌చోరీ

### భూముల రీ సర్వే నేనే మొదలు పెట్టా

### భూ సర్వేను ఒక మహాయజ్ఞంలా చేపట్టిన ఘనత మాది

### రైతుల గురించి ఏ మాత్రం చిత్తశుద్ధి లేని బాబు

### ఏ రాయి పెట్టి కొలవాలో కూడా తెలియని పెద్దమనిషి

### మీడియా సమావేశంలో మండిపడ్డ వైసిపి అధినేత జగన్



అమరావతి,**జనవరి22 ప్రజావినికిడి,**
భూముల రీ సర్వే అంశంలో సీఎం చంద్రబాబు నాయుడు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఆరోపించారు. ఈ భూమండలంపై ఇంత దారుణమైన క్రెడిట్ చోరీ చేయగలవారు ఎవరూ ఉండరు అంటూ జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం మీడియా సమావేశంలో...ప్రజా సమస్యలు, తాజా రాజకీయ పరిణామాలపై వ్యాఖ్యానించారు. ముఖ్యంగా భూముల రీ సర్వే చేయాలన్న కనీస ఆలోచనైనా చంద్రబాబుకు ఎప్పుడైనా వచ్చిందా అని జగన్ ప్రశ్నించారు. రైతుల సమస్యలు తీర్చాలన్న చిత్తశుద్ధి బాబుకు లేదని వ్యాఖ్యానించారు. రైతులు ఎదుర్కొంటున్న భూ వివాదాలకు ఏకైక పరిష్కారం సమగ్ర భూ రీ సర్వేనేనని స్పష్టం చేశారు. 2019కు ముందు భూములు సర్వే చేయడానికి అవసరమైన ఆధునిక టెక్నాలజీనే లేదని, తన పాదయాత్ర సమయంలోనే భూముల రీ సర్వే చేయాలన్న నిర్ణయం తీసుకున్నానని జగన్ అన్నారు.
2019 ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే సమగ్ర భూ సర్వే చేపడతామని హామీ ఇచ్చామని, ఆ మాటకు కట్టుబడి పారదర్శకంగా భూముల రీ సర్వే నిర్వహించామని జగన్ అన్నారు. రైతులకు, భూ యజమానులకు వివాదాలు లేకుండా, ట్యాంపరింగ్‌కు అవకాశం లేని విధంగా శాశ్వత భూ పత్రాలు అందించామని తెలిపారు. భూ సర్వేను ఒక మహాయజ్ఞంలా చేపట్టినట్లు తెలిపారు. బ్రిటిషర్ల కాలంలో దాదాపు వందేళ్ల క్రితం జరిగిన భూ సర్వే తర్వాత మళ్లీ 2020 డిసెంబర్ 21న భూముల రీ సర్వే ప్రారంభించామని జగన్ గుర్తుచేశారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఏనాడైనా ఇలాంటి సమగ్ర భూ సర్వే చేశారా? అని ప్రశ్నించారు. క్రయవిక్రయాలు జరిగినా, కుటుంబాల మధ్య భూ పంపకాలు జరిగినా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వ్యవస్థను రూపొందించామని అన్నారు. అలాగే రాష్ట్రంలో 15 వేల గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయడం దేశంలోనే ఒక రికార్డని.. ప్రతి సచివాలయంలో 10 మంది ఉద్యోగులను నియమించడం, ఒక్క నోటిఫికేషన్‌తోనే 1.34 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం కూడా చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలేనన్నారు. యూరప్, అమెరికాలో ఉపయోగించే అత్యాధునిక టెక్నాలజీతో భూముల రీ సర్వే నిర్వహించామని, గ్రామ సచివాలయాల్లోనే భూ రిజిస్ట్రేషన్లు జరిగేలా వ్యవస్థను తీసుకొచ్చామని జగన్ అన్నారు. భూ సర్వే అంటే ఏమిటో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలియదన్నారు. సర్వే రాళ్లు లేకుండా.. చంద్రబాబు సర్వే చేయిస్తున్నారని విమర్శించారు చంద్రబాబు సర్వేలో అసలు సర్వే రాళ్లు లేవన్నారు. 'సర్వే రాళ్లు లేకుండా.. చంద్రబాబు సర్వే చేయిస్తున్నారు. ఏ రాయి పడితే ఆ రాయి పెట్టి సర్వే అంటున్నారు. పాస్ బుక్‌ల విషయంలో మేం చేసిందే చేస్తున్నారు.. మేం ఇచ్చిన వాటికే కేవలం రంగు మార్చారంతే. ట్యాంపర్ చేయలేని పాస్‌బుక్‌లు ఇవ్వాలన్నదే మా తపన. పైగా వాటిల్లో విపరీతమైన తప్పులు ఉంటున్నాయి. కమిషన్లు తీసుకుని పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నారు. 22ఏ గురించి బాబు మాట్లాడం ఆశ్చర్యమేస్తోంది. 22ఏలో అడ్డగోలుగా భూములు పెట్టిన చరిత్ర బాబుది. 35లక్షల 40 వేల ఎకరాలపై 20.24 లక్షల మంది రైతులకు శాశ్వత హక్కులు కల్పించాం. 27.40 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు కల్పించాం. చుక్కల భూముల సమస్యలను కూడా మేం పరిష్కరించాం. ఇనాం భూములపై లక్షా 60 వేల మందికి హక్కులు కల్పించాం. 1.54 లక్షల ఆదివాసీలకు 3.26 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించాం. రూ. 55.79కు మేం పట్టాదార్ పాస్‌బుక్ ఇస్తే.. చంద్రబాబు రూ. 76కు పాస్‌బుక్ ఇస్తున్నారు. మేం పాతిన రాళ్లపై ఉన్న పేర్లను తొలగిస్తున్నారు.. ఇందుకోసం రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారు. సర్వే అంటే ఏంటో కూడా తెలియదు అన్నట్లు సాగుతోంది చంద్రబాబు సర్కార్ వ్యవహారం. సర్వే అంతిమ లక్ష్యాన్ని నీరుగారుస్తోంది చంద్రబాబు సర్కార్' అని ధ్వజమెత్తారు వైఎస్ జగన్. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం కోసం తాను చేసిన ప్రయత్నాలు, తీసుకున్న చర్యలను జగన్ సవివరంగా వివరించారు. గ్రామాల్లో సచివాలయ నిర్మాణాలు మొదలుకొని, వాటిల్లో ఒక్కోదాంట్లో పది మంది సిబ్బంది నియామకాలను కూడా ఆయన గుర్తు చేశారు.

# కోటప్పకొండను దర్శించుకున్న పవన్ కళ్యాణ్

### త్రికూటేశ్వరాలయలంలో ప్రత్యేక పూజలు -పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

పల్నాడు, **జనవరి22 ప్రజావినికిడి,**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్న ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనానికి పవన్ వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.5 కోట్లతో చేపట్టిన కొత్తపాలెం-కోటప్పకొండ రోడ్డును ఆయన ప్రారంభించారు. కోటప్పకొండలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు విచ్చేసిన ఆయన త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకుని, మధ్యాహ్న వేళ ప్రత్యేక పాదాభిషేక సేవలో పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, ఫల ప్రసాదం సమర్పించారు. పాదాభిషేకానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కొటప్పకొండ ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజా మల్రాజు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు, దేవాదాయశాఖ ఆర్జేసి చంద్రశేఖర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరావు అధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సంప్రదాయబద్ధంగా తలపాగా చుట్టగా, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఉత్తరద్వారం నుండి ఆలయంలోకి ప్రవేశించారు. ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



అరవింద బాబు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, మాజీ ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంటేశ్వరరావు, నియోజకవర్గ ఇంచార్జ్ సయ్యద్ జిలానీ తదితరులు స్వామివారి పూజలో పాల్గొన్నారు.
అంతకు ముందు కోటప్పకొండ పర్యటనకు వచ్చిన పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుతో పాటు జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు ఘన
స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి కోటప్పకొండ ఆలయం వరకు ఆలయం నుంచి నూతన రహదారి ప్రారంభోత్సవం వరకు కూటమి పక్షాల కార్యకర్తలు



రోడ్డుకి ఇరువైపులా నిలబడి పూలు, హారతులతో స్వాగతం పలికారు. ప్రజలకు అభివాదం చేస్తూనే ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

# సంచలనం సృష్టించిన అభిషేక్ శర్మ


భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ కొత్త ఏడాదిలో తొలి మ్యాచ్‌తోనే చరిత్ర సృష్టించాడు. బుధవారం నాగ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన టీ20లో అభిషేక్ తుపాన్ ఇన్నింగ్స్‌తో సంచలనం సృష్టించాడు. 35 బంతుల్లోనే 84 పరుగులు చేసి రఫ్ఫాడించిన అభిషేక్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ దక్కింది. ఈ ఇన్నింగ్స్‌లో ఎనిమిది సిక్స్‌లు బాదాడు. కివీస్‌పై ఒక టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన ఆసియా బ్యాటర్‌గా అరుదైన ఘనత సాధించాడు. దీంతోపాటు అభిషేక్ ఓ ప్రపంచ రికార్డును సైతం అందుకున్నాడు.ఈ మ్యాచ్‌లో అభిషేక్ తాను ఎదుర్కొన్న తొలి బంతి నుంచే దూకుడుగా ఆడాడు. దీంతో అతడు 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఈ క్రమంలో అభిషేక్ తన ఖాతాలో వరల్డ్ రికార్డ్ వేసుకున్నాడు. తాజా ఇన్నింగ్స్‌తో అతడు టీ20ల్లో 5 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ మైలురాయిని అభిషేక్ కేవలం 2,898 బంతుల్లోనే అందుకున్నాడు. దీంతో టీ20ల్లో అత్యంత వేగంగా (బంతుల పరంగా) 5 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ ఆండ్రీ రస్సెల్ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. ఇదివరకు ఈ రికార్డ్ రస్సెల్ పేరిట ఉండేది. అతడు 2,942 బంతుల్లో 5,000 పరుగులు చేశాడు. ఇప్పుడు అభిషేక్ ఈ లిస్ట్‌లో టాప్‌లో ఉన్నాడు. అలా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్ వంటి ఆటగాళ్లు కూడా సాధించలేని ఘనతను అభిషేక్ అతి తక్కువ రోజుల్లేనే అందుకున్నాడు. అభిషేక్ ఈ మ్యాచ్‌లో కేవలం 22 బంతుల్లోనే తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. దీంతో న్యూజిలాండ్‌పై అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గానూ అభిషేక్ రికార్డు కొట్టాడు. అలాగే 25 లేదా అంతకంటే తక్కువ బంతుల్లో ఎక్కువ హాఫ్ సెంచరీలు నమోదు చేసిన క్రికెటర్‌గా అభిషేక్ టాప్‌లో నిలిచాడు. అతడు ఎనిమిది సార్లు ఈ ఫీట్ సాధించాడు. దీంతో సూర్యకుమార్ యాదవ్, ఫిల్ సాల్ట్, ఇవాన్ లూయిస్‌ను అధిగమించాడు. ఈ ముగ్గురు



ఏడేసిసార్లు ఆ ఘనత సాధించారు.కాగా, అభిషేక్ శర్మ 2024లో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. ఇప్పటిదాకా 34 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 37.47 యావరేజ్, 190.93 స్ట్రైక్ రేట్‌తో 1199 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఏడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో 112 ఫోర్లు, 81 సిక్స్‌లు బాదాడు. ఇక ఐసీసీ టీ20 ర్యాకింగ్స్‌లోనూ అభిషేక్ నెం.1 స్థానంలో కొనసాగుతున్నాడు.

# చరిత్ర సృష్టించిన సింధు

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అరుదైన రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ కెరీర్‌లో మొత్తం 500 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించింది. ఇండోనేషియా మాస్టర్స్ 2026లో భాగంగా డెన్మార్క్ క్రీడాకారిణి లైన్ హోజ్‌మార్క్‌ను వరుస సెట్లలో ఓడించి ఈ ఘనతను సొంతం చేసుకుంది. బ్యాడ్మింటన్ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో ఇప్పటి వరకు ఈ రికార్డును ఐదుగురు మాత్రమే అందుకున్నారు. ఇప్పుడు ఆరో ప్లేయర్‌గా సింధు నిలిచింది. భారత్ తరఫున ఈ ఘనత నెలకొల్పింది సింధునే. కాగా, ఇండోనేషియా మాస్టర్స్‌లో తాజాగా జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో లైన్ హోజ్‌మార్క్‌ను ఎదుర్కొన్న సింధు 21-19, 21-18 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించింది. గేమ్‌లో తొలి నుంచీ ఆధిపత్యం ప్రదర్శించిన సింధు, ప్రత్యర్థిని రెండు సెట్లలో చిత్తు చేసింది. దీంతో 43 నిమిషాల్లో ఆట ముగిసింది. కాగా, లైన్ హోజ్‌మార్క్‌ను సింధు ఇప్పటిదాకా ఆరుసార్లు ఢీ కొట్టగా, అందులో అత్యధికంగా ఐదుసార్లు ఆమెపై నెగ్గడం విశేషం. తాజా విజయంతో సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో చైనా టాప్ సీడ్, వరల్డ్ నెం.4 చెన్ యూఫీతో సింధు తలపడనుంది. ఇప్పటిదాకా సింధు- యూఫీ ఓవరాల్‌గా 13సార్లు ఢీ కొట్టారు. ఈ ముఖాముఖి పోరులో 7-6 తో చైనా యూఫీ స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. చివరిసారిగా ఈ చైనా క్రీడాకారిణిపై సింధు 2019లో విజయం సాధించింది. ఇప్పుడు మరోసారి నెగ్గి రికార్డు సమం చేయాలని సింధు భావిస్తోంది. ఈ కొత్త ఏడాదిలో క్వార్టర్ ఫైనల్స్ ఆడడం సింధుకు ఇది రెండోసారి. రీసెంట్‌గా మలేసియా ఓపెన్‌లో సింధు తృటిలో ఫైనల్ మిస్సైంది. ఈ టోర్నీలో క్వార్టర్స్‌లో యమగుచిపై నెగ్గిన సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. కానీ, సెమీస్‌లో వాంగ్ (చైనా)ను ఢీ కొట్టిన ఆమె 16-21, 15-21 తేడాతో ఓడి ఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక రెండు వారాల్లోనే మరోసారి క్వార్టర్స్‌కు చేరుకుంది. ం



# జట్టును ఎంపిక క్లిష్టమైనది

- కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది
- కెప్టెన్‌కు ఇది అత్యంత అత్యంత క్లిష్టమైన అంశం
- జట్టు ఎంపికలో అందరినీ సంతృప్తి పర్చలేము
- ఆటగాడికి ఎందుకు ఆడించట్లేదో చెప్పాలి: రోహిత్ శర్మ



రోహిత్ శర్మ జట్టు ఎంపిక విషయంపై కీలక కామెంట్స్ చేశాడు. జట్టు ఎంపికలో కఠిన నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టమైన విషయమని అన్నాడు. అయితే ఒక ఆటగాడిని మ్యాచ్‌లో ఆడించకుండా, ఎందుకు పక్కన పెట్టామో అతడికి వివరించాల్సిన అవసరం ఉందని రోహిత్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. వచ్చే నెలలో భారత్-శ్రీలంక సంయుక్త వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌నకు రోహిత్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో పలు విషయాలు షేర్ చేసుకున్నాడు. 'జట్టును ఎంపిక చేసే ప్రక్రియ అత్యంత క్లిష్టమైనది. ఈ క్రమంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కెప్టెన్‌కు ఇది అత్యంత అత్యంత క్లిష్టమైన అంశం. జట్టు ఎంపికలో అందరినీ సంతృప్తి పర్చలేము. అయితే ఎందుకు పక్కన పెట్టామో మాత్రం ఆటగాడికి వివరంగా చెప్పడం అనేది ముఖ్యం. 2022 ఆసియా కప్, టీ20వరల్డ్‌కప్ టోర్నీల్లో శ్రేయస్ అయ్యర్‌ను కాదని బౌలింగ్ చేయగలిగే దీపక్ హుడాను తీసుకున్నాం. టీమ్ బ్యాలెన్స్‌గా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నేను, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా అయ్యర్‌కు తెలియజేశాం' 'ఇక 2023 వన్డే వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో పేసర్ మహ్మద్ సిరాజ్‌కు కూడా ఇదే మాదిరిగా వివరించి చెప్పాం. రానున్న టీ20 ప్రపంచ కప్‌లో టీమండియా సత్తా చాటుతుందనే నమ్మకం ఉంది. టీమ్‌లో 80 నుంచి 90 శాతం మంది ఆటగాళ్లు గత రెండేళ్లుగా కలిసే ఆడుతున్నారు. టీమ్ యావరేజ్ వయసు 25 ఏళ్లు ఉండటం కూడా కలిసొచ్చే అంశమే' అని రోహిత్ శర్మ తెలిపాడు. అలాగే రోహిత్ తన కెరీర్‌లో తొలిసారి టీ20 ప్రపంచకప్‌లో ఆడడం లేదు. 2007లో ప్రారంభమైన ఈ పొట్టి కప్ టోర్నీ ప్రతీ ఎడిషన్‌లో రోహిత్ ఆడాడు. అయితే టీ20 ఫార్మాట్‌రు రిటైర్మెంట్ ప్రకటించడంతో హిట్‌మ్యాన్ ఈసారి పొట్టికప్‌కు దూరమైయ్యాడు. దీంతో తొలిసారిగా ఈ టోర్నమెంట్‌ను ఇంటి నుంచి చూడబోతుండడం తనకు వింత అనుభవమని రోహిత్ అన్నాడు. 'నా కెరీర్‌లో ఇప్పటి వరకు జరిగిన ప్రతి టీ20 వరల్డ్‌కప్ ఎడిషన్‌లో నేను ఆడాను. కానీ, ఇప్పుడు తొలిసారి ఇంటి నుంచి వరల్డ్‌కప్ మ్యాచ్‌లు చూడనుండటం వింతగా అనిపిస్తుంది. ఒకవేళ స్టేడియానికి వెళ్లి చూసినా కూడా, అది గతంలో మాదిరిగా ఉండదు. ఇదొక కొత్త అనుభూతిని ఇస్తుంది' అని రోహిత్ అన్నాడు. కాగా, వచ్చే నెల 07న భారత్- శ్రీలంక సంయుక్త వేదికలుగా టీ20 వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది.

# అక్షర్ పటేల్ గాయంతో టీమ్ ఇండియా ఆందోళన!



అక్షర్ పటేల్ భారత్, న్యూజిలాండ్ మధ్య నాగ్‌పూర్‌లో బుధవారం జరిగిన మొదటి ౨20 మ్యాచ్‌లో గాయపడ్డాడు. వాస్తవానికి, బౌలింగ్ చేస్తున్నప్పుడు, అక్షర్ డారిల్ మిచెల్ కొట్టిన షాట్‌ను అందుకోవడానికి ప్రయత్నించగా, బంతి అతని ఎడమ చేతి చూపుడు వేలి పైభాగానికి తగిలింది. బంతి తగలగానే అతని వేలి నుంచి రక్తం వచ్చింది. బంతి తగిలే సమయానికి అక్షర్ ఓవర్లో మూడు బంతులు మాత్రమే వేశాడు. అక్షర్ ఎడమ చేతి వాటం బౌలర్ కావడంతో, అతను తన ఓవర్ పూర్తి చేయకుండానే మైదానం నుంచి వెళ్లిపోయాడు. అక్షర్ ఓవర్లోని మిగిలిన మూడు బంతులను అభిషేక్ శర్మ వేశాడు. అక్షర్ మైదానం నుంచి వెళ్ళిపోవడం పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతోంది, ఇందులో 2026 ప్రపంచ కప్ నుంచి అతను వైదొలగడం కూడా ఒకటి. అక్షర్‌ను రాబోయే ౨20 ప్రపంచ కప్ కోసం టీమ్ ఇండియా వైస్ కెప్టెన్‌గా నియమించారు. అతను టోర్నమెంట్ నుంచి వైదొలగడం గురించి మాట్లాడితే, అక్షర్ గాయంపై దీజజ× నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక అప్‌డేట్ రాలేదు. అంతేకాకుండా, భారత ఆల్ రౌండర్ గాయం ఎంత తీవ్రంగా ఉందో కూడా తెలియరాలేదు. నాగ్‌పూర్‌లో జరిగిన మొదటి ౨20లో టీమ్ ఇండియా న్యూజిలాండ్‌ను ఓడించి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మ్యాచ్‌లో టీమ్ ఇండియా మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఇది ౨20లలో న్యూజిలాండ్‌పై భారత్ సాధించిన అత్యధిక స్కోరు. ఈ సమయంలో, మెన్ ఇన్ బ్లూ కోసం అభిషేక్ శర్మ 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 84 పరుగులు చేశాడు. అనంతరం ఛేజింగ్‌కు దిగిన కివీ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 190 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ సమయంలో, గ్లెన్ ఫిలిప్స్ జట్టు కోసం మంచి బ్యాటింగ్ చేస్తూ 40 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 78 పరుగులు చేశాడు. అయితే, ఫిలిప్స్ ఇన్నింగ్స్ జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. సిరీస్‌లో రెండో మ్యాచ్ జనవరి 23, ఆదివారం నాడు జరగనుంది.

# టీ20 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌కు చాన్స్ !

2026 టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు తమ జట్టును పంపేది లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మరోసారి స్పష్టం చేసింది. ఢాకాలో గురువారం క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్, సీనియర్ ఆటగాళ్లు , బోర్డు సభ్యుల మధ్య జరిగిన కీలక సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. భారత్‌లో భద్రతా పరమైన ఆందోళనలు ఇంకా తొలగిపోలేదని, అందుకే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ పట్టుబడుతోంది. ఈ నిర్ణయం పూర్తిగా తమ ప్రభుత్వానిదేనని ఆసిఫ్ నజ్రుల్ స్పష్టం చేశారు.బంగ్లాదేశ్ అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించింది. భారత్‌లో ఆటగాళ్లకు ఎలాంటి ముప్పు లేదని స్వతంత్ర భద్రతా సంస్థల నివేదికలు చెబుతున్నాయని ఐసీసీ పేర్కొంది. టోర్నీ ప్రారంభానికి కొద్ది రోజులు ముందు షెడ్యూల్ మార్చడం అసాధ్యమని, బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి 24 గంటల సమయం ఇస్తున్నామని హెచ్చరించింది. ఒకవేళ బంగ్లా రాకపోతే, వారి స్థానంలో 'గ్రూప్-సి' లో స్కాట్లాండ్ ను చేరుస్తామని ఐసీసీ బోర్డు ఇప్పటికే ఓటింగ్ ద్వారా నిర్ణయించింది.ఐసీసీ అల్టిమేటంపై బీసీబీ ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లాం ఘాటుగా స్పందించారు. ఒక అంతర్జాతీయ సంస్థ ఇలాంటి అల్టిమేటం ఇవ్వడం సరికాదు. మా దేశంలో 20 కోట్ల మంది క్రికెట్ అభిమానులు ఉన్నారు, మేము లేకపోతే ఐసీసీకే భారీ నష్టం అని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే శ్రీలంకను కో-హోస్ట్ అని పిలవడాన్ని ఆయన తప్పుబట్టారు, ఇది కేవలం హైబ్రిడ్ మోడల్ మాత్రమేనని అన్నారు. ఐసీసీ సమావేశంలో జరిగిన కొన్ని చర్చలు దిగ్భ్రాంతికి గురిచేశాయని, తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ద్వేషంతో తీసుకుంటున్న ఈ నిర్ణయాలు బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేసే అవకాశం ఉంది.



# తాను ప్రేమలో ఉన్నట్లు ప్రకటించిన హీరోయిన్ ఫరియా అబ్దుల్లా



'జాతి రత్నాలు' సినిమాతో స్టార్‌డమ్ దక్కించుకున్న హైదరాబాదీ భామ ఫరియా అబ్దుల్లా ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా నటన, డ్యాన్స్, ర్యాప్ సాంగ్స్‌తో మల్టీ టాలెంటెడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఫరియా.. తాజాగా తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా, తాను ప్రస్తుతం ప్రేమలో ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఒక హిందూ అబ్బాయితో డేటింగ్ చేస్తున్నానని, ఇండస్ట్రీలో ఉంటూనే కెరీర్‌వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడంలో తన ప్రియుడి మద్దతు ఎంతో కీలకమని వెల్లడించారు. ఫరియా మనసు దోచుకున్న ఆ వ్యక్తి సినీ పరిశ్రమకు చెందిన యంగ్ కొరియోగ్రాఫర్ కావడం విశేషం. ఇద్దరూ కలిసి పని చేస్తున్నామని, తనలోని డ్యాన్స్, మ్యూజిక్ టాలెంట్‌ను బయటకు తీసుకురావడంలో అతని పాత్ర చాలా ఉందని ఫరియా తెలిపారు. మతభేదాలపై వస్తున్న ప్రశ్నలకు కూడా ఆమె స్పష్టతనిచ్చారు. తాను ముస్లింను అయినప్పటికీ, హిందూ యువకుడితో ఉన్న ఈ బంధాన్ని కేవలం లవ్ అఫైర్‌గా చూడట్లేదని, ఇది ఒక బలమైన పార్టనర్‌షిప్ అని చెప్పారు. వరుస సినిమాలతో కెరీర్‌లో జోరు కొనసాగిస్తున్న ఫరియా.. తన ప్రేమ, వ్యక్తిగత జీవితంపై చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# నిర్మాతల ఆలోచన మారాలి



మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలు వసూళ్లు సాధించలేవని పలువురు నిర్మాతలు భావిస్తున్నారని, ఈ విషయంలో వారి ఆలోచనా ధోరణి మారాలని నటి మాళవిక మోహనన్ అభిప్రాయపడ్డారు. గతేడాది విడుదలై సంచలనం సృష్టించిన చిన్న చిత్రాల్లో 'కొత్తలోక: చాప్టర్ 1' ఒకటి. తక్కువ వ్యయంతో రూపొందినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుని సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా నటి మాళవిక మోహనన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మహిళా ప్రధాన చిత్రాలపై నిర్మాతల దృక్పథం గురించి మాట్లాడారు. మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలకు వసూళు రావనే భావన చాలా మంది నిర్మాతల్లో ఉందని, అందుకే కథానాయికలు ప్రధాన పాత్రల్లో నటించే చిత్రాలను అధిక బడ్జెట్‌తో నిర్మించడానికి ముందుకు రారని ఆమె అన్నారు. మహిళా కథలకు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపకపోవడం వల్లనే అలాంటి సినిమాలు అరుదుగా వస్తున్నాయని మాళవిక పేర్కొన్నారు. అయితే ఈ ఆలోచనకు 'కొత్తలోక: చాప్టర్ 1' గట్టి సమాధానం చెప్పిందని ఆమె అన్నారు. యువ నటి ప్రధాన పాత్రలో నటించినప్పటికీ, ఆ చిత్రం రికార్డులు సృష్టించిందని, బాక్సాఫీస్ వద్ద అద్భుత వసూళ్లు సాధించిందని తెలిపారు. కల్యాణి ప్రియదర్శన్ ఆ పాత్రకు న్యాయం చేస్తుందనే నమ్మకంతోనే దర్శక నిర్మాతలు ముందుకు వెళ్లారని, అందుకే ఇంత పెద్ద విజయం సాధ్యమైందని ఆమె అన్నారు. గతేడాది ఆగస్టులో విడుదలైన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి మలయాళ చిత్ర పరిశ్రమలో సరికొత్త రికార్డును నెలకొల్పిన విషయం తెలిసిందే. కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో డొమినిక్ అరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీ వేదిక 'జియో హాట్‌స్టార్'లో ప్రసారం అవుతోంది.

# ఓటీటీకి వచ్చేసిన సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ 'శంబాల'!

ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన సినిమా 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమా, టైటిల్ తోనే అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సినిమా, డిసెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చింది. 12 కోట్లతో నిర్మితమైన ఈ సినిమా, 20 కోట్లకి పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టింది. 14 కోట్లకి పైకి నెట్ ను వసూలు చేసింది. చాలా గ్యాప్ తరువాత ఆదిసాయికుమార్ సాధించిన హిట్ సినిమాగా ఇది నిలిచింది.

అలాంటి ఈ సినిమా ఓటీటీకి ఎప్పుడు వస్తుందా అని చాలా మంది వెయిట్ చేస్తున్నారు. థియేటర్స్ వైపు నుంచి కన్నా ఓటీటీ వైపు నుంచి ఈ సినిమాకి మంచి రెస్పాన్స్ వస్తుందనే అభిప్రాయాలు మొదటి నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా, ఈ రోజునే 'ఆహా' ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చేసింది. ఆది సాయికుమార్ తో పాటు అర్చన అయ్యర్ .. శ్వాసిక .. మధునందన్ .. రవివర్మ .. రామరాజు .. సిజూ తదితరులు కీలకమైన పాత్రలను పోషించారు. కథ విషయానికి వస్తే .. 'శంబాల' అనే ఒక మారుమూల పల్లెలో ఒక 'ఉల్క' పడుతుంది. అప్పటి నుంచి ఆ ఊరిలో అనూహ్యమైన సంఘటనలు చోటుచేసుకుంటూ ఉంటాయి. ఆ ఉల్కను అందరూ కూడా 'బండభూతం' అని పిలుస్తుంటారు. అక్కడి మూఢనమ్మకాలను తరిమికొట్టడం కోసం విక్రమ్ వస్తాడు. ఆ ఊళ్లో అతనికి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? జరుగుతున్న సంఘటనలకు కారకులు ఎవరు? అనేది కథ.



# పవన్ కల్యాణ్ తో సినిమా చేయాలనే కోరిక :అనిల్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కిన 'మన శంకర వరప్రసాద్ గారు' ఘన విజయం సాధించిన తర్వాత దర్శకుడు అనిల్ రావిపూడి జోష్‌లో ఉన్నారు. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుని ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ నేపథ్యంలో మీడియాతో ముచ్చటించిన అనిల్... ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ సినిమా కోసం చిరంజీవి చేసిన ఫొటో షూట్ చూసి తానే స్టన్ అయ్యానని అనిల్ చెప్పారు. ఆ లుక్ సినిమా మొత్తం కొనసాగాలని భావించానని, చిరంజీవి కూడా అదే విధంగా సహకరించారని తెలిపారు. చిరంజీవిని ఈ లుక్‌లో చూసి ప్రేక్షకులు ఫిదా అయ్యారని అన్నారు. పవన్ కల్యాణ్ తో సినిమా చేయడంపై ఆయన స్పందిస్తూ... ఇప్పటి వరకు తాను పవన్ కల్యాణ్ ను కలవలేదని చెప్పారు. డిప్యూటీ సీఎంగా ఆయన ఎంతో బిజీగా ఉన్నారని... ఆయనకు ఎన్నో పనులు ఉంటాయని అన్నారు. ప్రస్తుతం ఆయన రెగ్యులర్ గా సినిమాలు చేయడం లేదని చెప్పారు. ఆయనతో సినిమా చేయాలనే ఉత్సాహం తనకు ఉందని... ఒకవేళ తమ కాంబినేషన్ కుదిరితే సంతోషమేనని చెప్పారు. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దామని అన్నారు. తన తర్వాతి సినిమా కూడా 200 శాతం ఎంటర్‌టైనర్ అని అనిల్ స్పష్టం చేశారు. తాను ప్రయోగాలకంటే ప్రేక్షకులు కోరుకునే వినోదానికి, కొత్త కథలకే ప్రాధాన్యం ఇస్తానన్నారు. జూన్‌జులైలో కొత్త సినిమా సెట్స్‌పైకి వెళు తుందని చెప్పారు. వచ్చే సంక్రాంతికి మరో సినిమా కూడా ప్లాన్‌లో ఉందని, ఆ తర్వాత పూర్తిగా భిన్నమైన జానర్‌లో సినిమా చేస్తానని వెల్లడించారు.




# పైలట్, ఏఐ నిపుణుడిగా మారేందుకు సిద్ధమైన నటుడు ప్రసన్న



విలక్షణ నటనతో తమిళ చిత్రసీమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రసన్న (నటి స్నేహ భర్త), ఇప్పుడు తన చిరకాల కలలను నిజం చేసుకునే పనిలో పడ్డారు. నటనను కొనసాగిస్తూనే కమర్షియల్ పైలట్‌గా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నిపుణుడిగా మారేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కొత్త ప్రయాణానికి తనకు ప్రముఖ నటుడు అజిత్ కుమార్ స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో ప్రసన్న మాట్లాడుతూ, "ఈ ఏడాది నాకు చాలా ప్రత్యేకమైనది. ఎప్పటినుంచో నా బకెట్ లిస్ట్‌లో ఉన్న రెండు కోరికలను ఇప్పుడు బయటకు తీసి, వాటిని నిజం చేసుకుంటున్నాను" అని తెలిపారు. పాఠశాల రోజుల్లోనే పైలట్ కావాలని కలలు కన్నానని, అయితే నటనను కెరీర్‌గా ఎంచుకున్న తర్వాత ఆ కోరికను పక్కన పెట్టేశానని చెప్పారు. "వచ్చే ఏడాది ఇదే సమయానికి నేను ఫ్లైట్ స్కూల్ పాఠాలు పూర్తి చేసి, కమర్షియల్ పైలట్ లైసెన్స్ కూడా సాధిస్తానని నమ్ముతున్నాను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ నిర్ణయానికి అజితే కారణమని ప్రసన్న స్పష్టం చేశారు. "'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో అజిత్ సర్‌తో కలిసి పనిచేస్తున్నప్పుడు, మోటార్ రేసింగ్‌పై ఆయనకున్న అభిరుచి, పట్టుదల నన్ను ఎంతగానో కదిలించాయి. నటనలో బిజీగా ఉన్నప్పటికీ, మన అభిరుచికి కూడా సమయం కేటాయించవచ్చని ఆయన్ను చూసే తెలుసుకున్నాను. ఆ స్ఫూర్తితోనే నేను కూడా నా కలలను సాకారం చేసుకునేందుకు కృషి చేస్తున్నాను" అని వివరించారు. ఇక ఏఐ నిపుణుడిగా మారాలనే తన రెండవ లక్ష్యం గురించి మాట్లాడుతూ, కోవిడ్ సమయం నుంచి నటనకు మించి ఏదైనా నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగిందన్నారు. "నా స్నేహితుడు సుకుమార్ నడుపుతున్న ఆన్‌లైన్ ఇన్‌స్టిట్యూట్‌లో గత నెలన్నరగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో శిక్షణ తీసుకుంటున్నాను. అమెజాన్‌కు చెందిన ఏడబ్ల్యూఎస్, ఆ తర్వాత అజూర్ సర్టిఫికేషన్ కూడా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాను" అని ప్రసన్న తన భవిష్యత్ ప్రణాళికలను పంచుకున్నారు.

# రెహమాన్ వద్దకి పెద్ది ఫస్ట్ హాఫ్..!



రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమా రూపొందుతోంది అనేందుకు సాక్ష్యంగా ఇప్పటికే విడుదలైన పాట, టీజర్ నిలిచాయి. రామ్ చరణ్ గత చిత్రం ఫలితం ఫ్యాన్స్‌ను తీవ్రంగా నిరాశ పరిచింది. అందుకే పెద్ది విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. అంతే కాకుండా పెద్ది సినిమా విడుదల విషయంలోనూ మేకర్స్ గట్టి పట్టుదలతో ఉన్నారు అనేది టాక్. సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చిందని తాజాగా సినిమా మొదటి సగం యొక్క ఎడిటింగ్ వర్షన్ సైతం పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ పూర్తి చేసి సంతృప్తి చెందిన తర్వాతే దర్శకుడు బుచ్చిబాబు సెకండ్ హాఫ్ యొక్క ఎడిటింగ్ వర్క్ ను మొదలు పెట్టించాడని ఆయన సన్నిహితులు, యూనిట్ సభ్యులు చెబుతున్నారు. బుచ్చిబాబు గత చిత్రం ఉప్పెన భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. పైగా సుకుమార్ శిష్యుడు కావడంతో బుచ్చి బాబు మేకింగ్ పై మెగా ఫ్యాన్స్ చాలా నమ్మకంగా ఉన్నారు .అందుకు తగ్గట్లుగానే సినిమా ఉంటుంది అని మేకర్స్ బలంగా చెబుతున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న విషయం తెల్సిందే. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాలను చాలా అందించిన రెహమాన్ సంగీతం కచ్చితంగా పెద్దికి సైతం ప్లస్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. అన్నట్లుగానే సినిమా నుంచి వచ్చిన చికిరి చికిరి సాంగ్ సెన్షేషనల్ హిట్‌గా నిలిచింది. ఈమధ్య కాలంలో ఆ స్థాయి విజయాన్ని, వ్యూస్ ను దక్కించుకున్న పాట మరేది లేదు అంటూ సోషల్ మీడియాలో అభిమానులు, అన్ని వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు.

సినిమా మొదటి సగం ఎడిటింగ్ సైతం పూర్తి చేసిన బుచ్చిబాబు ఇటీవలే ఆ భాగంను రెహమాన్ కి పంపించాడని, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ను రెహమాన్ ప్రారంభించబోతున్నాడు అంటూ యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. రెహమాన్ కాస్త స్లోగా వర్క్ చేస్తాడని, ఆయన నుంచి బెస్ట్ ఔట్ పుట్ రాబట్టుకోవాలి అంటే కాస్త ఎక్కువ సమయం ఆయనకు ఇవ్వాలి అంటారు. అందుకే బుచ్చిబాబు మొదటి హాఫ్ ఎడిటింగ్ సైతం పూర్తి చేసి ముందే ఇవ్వడం వల్ల విడుదల సమయం వరకు రెహమాన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అతి త్వరలోనే సెకండ్ హాఫ్ సైతం ఫైనల్ ఎడిట్ చేసి ఇస్తే రెహమాన్ దానికి సైతం తన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి సినిమా షూటింగ్ కాస్త స్లో అయినప్పటికీ చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ విషయంలో మాత్రం రాజీ లేకుండా చాలా స్పీడ్‌గా నడుస్తున్నట్లుగా తాజా పరిస్థితులు చూస్తే అర్థం అవుతుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613